తెలుగు దినపత్రిక
https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 138

శనివారం అక్టోబర్ 18, 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఎంఐఎం మద్దతు



హైదరాబాద్, అక్టోబర్ 17 (అక్షరగళం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఎంఐఎం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.పదేళ్లు బీఆర్ఎస్ ప్రాతినిధ్యం వహించినప్పటికీ, ఆ పార్టీ అధికారంలోనూ ఉన్నప్పటికీ అభివృద్ధి జరగలేదని అసదుద్దీన్ విమర్శించారు. నియోజకవర్గంలో ఉన్న మురికివాడల్లో సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. సెంటిమెంట్ కంటే అభివృద్ధి ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 37 శాతం ఓట్లు సాధించిన గులాబీ పార్టీ పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి కేవలం 15 శాతం ఓట్లు మాత్రమే సాధించిందని అసదుద్దీన్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఓట్లన్నీ ఎంపీ ఎన్నికలలో బీజేపీకి మళ్లినట్లుగా స్పష్టమవుతోందని ఆయన విశ్లేషించారు.

అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లుగా అసద్ స్పష్టం చేశారు. త్వరలో జరిగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయానికి ఎంఐఎం కార్యకర్తలు, నాయకులు సహకరించాలని కోరారు.

## ఆస్తులు అమ్ముకుని కాంగ్రెస్‌ను కాపాడా..!



- కాంగ్రెస్ పార్టీ నన్ను మోసం చేసింది
- ఇదేనా నాకు పార్టీ ఇచ్చే బహుమతి?
- నాకు మంత్రి పదవి ఇస్తానని మోసం చేశారు
- బీజేపీ, బీఆర్ఎస్ నుంచి వచ్చిన వాళ్లకు ఇస్తారా?
- కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఫైర్

నల్లగొండ,అక్టోబర్17అక్షరగళం): మంత్రి పదవి దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంతపార్టీపై మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌ను కాపాడేందుకు తన ఆస్తులు అమ్ముకున్నానని, కానీ పార్టీ తనను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి మిగతా.. 2లో



## బిసి బంద్‌కు జాగృతి సంపూర్ణ మద్దతు

- ఆర్. కృష్ణయ్య లేఖపై కవిత వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్17అక్షరగళం): బీసీ బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. బీసీల రిజర్వేషన్ల కోసం తాను పోరాడతానని ఉద్ఘాటించారు. బంద్ ఫర్ జస్టిస్ పేరుతో 18వ తేదీన బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఆందోళన నిర్వహించనున్నాయి. ఈ క్రమంలో బీసీల బంద్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల మిగతా.. 2లో



## పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్17అక్షరగళం): పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయండి. తొలి దశలో ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌పై దృష్టి సారించండి.ప్రతి ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలి. ప్లే గ్రౌండ్, అవసరమైన తరగతి గదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలి.ఇందుకు విద్యా శాఖ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించండి. సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలానికి తరలించండి. నర్సరీ నుంచి మిగతా.. 2లో



## భగ్గుమంటున్న బంగారం

- అందనంతగా రోజురోజుకూ పెరుగుదల
- ఏకంగా 3వేలు పెరిగిన తులం బంగారం

హైదరాబాద్, అక్టోబరు17 అక్షరగళం): బంగారం భగభగమండుతోంది. సామాన్యులను ఊరిస్తున్న పుత్తడి సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. ఏకంగా రూ.1.40 లక్షల వైపుకు దూసుకెళ్తోంది. ధనత్రయోదశి కి ఒక్కరోజు ముందు బంగారం ధరలు భారీగా పెరిగాయి. శుక్రవారం ఒక్కరోజే ఏకంగా రూ.3 వేలకుపైనే పెరిగింది. ఫలితంగా తులం బంగారం రూ.1.35 లక్షలు దాటి సరికొత్త రికార్డు మిగతా.. 2లో

## బంద్ ఫర్ జస్టిస్.. నేడు రాష్ట్ర బంద్

- బిసి సంఘాలకు అన్ని పార్టీల మద్దతు
- బిజెపి లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు

హైదరాబాద్,అక్టోబరు17 అక్షరగళం): బంద్ ఫర్ జస్టిస్ పేరుతో18వ తేదీన బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఆందోళన నిర్వహించనున్నాయి. ఈ క్రమంలో బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోంది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, లెఫ్ పార్టీలు కూడా బంద్‌ఉ మద్దతు ఇచ్చాయి. బంద్‌ను విజయవంతం చేయడం ద్వారా ఆవేదనను తెలియచేయాలని ఆర్ .కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఇప్పటికే అన్ని పార్టీలను నేరుగా కలిసి కోరారు. బిసి బంద్‌కు అందరి మద్దతు ఉందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ బిల్లును అడ్డుకునే వాళ్లు కూడా ఈ బంద్‌లో పాల్గొంటున్నారని చెప్పుకొచ్చారు.



శుక్రవారం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తాను కూడా బంద్‌లో పాల్గొంటానని ఉద్ఘాటించారు. ఈ బంద్‌లో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అని ఉద్ఘాటించారు. తాము అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి ఈ బంద్‌లో మిగతా.. 2లో


## గ్రీన్ కార్డ్ లాటరీలోనూ భారత్‌పై ఆంక్షలు



- తక్కువ వలసలు ఉన్న దేశాలకు ప్రాధాన్యం
- 2028 వరకు యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీకి దూరం
- భారతీయులు లక్ష్యంగా అమెరికా నిర్ణయం

వాషింగ్టన్,అక్టోబర్17అక్షరగళం): ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటినుంచి అమెరికా వీసా నిబంధనలను మరింత కఠినతరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారతీయులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలో పాల్గొనేందుకు భారతీయులకు మిగతా.. 2లో

## బీహార్ మహాఘట్‌బంధన్ సీఎం అభ్యర్థిగా తేజస్వీ యాదవ్



- కాంగ్రెస్ ఎంపి అఖిలేష్ ప్రసాద్ సింగ్ ప్రకటన

పాట్నా,అక్టోబర్17అక్షరగళం): బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ దగ్గర పడుతుండగా విపక్ష మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనే దానిపై స్పష్టత వచ్చింది. కూటమి ప్రధాన భాగస్వామ పక్షమైన ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ 'మహాఘట్‌బంధన్' ముఖ్యమంత్రి అభ్యర్థి అని కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు అఖిలేష్ ప్రసాద్ సింగ్ అధికారికంగా శుక్రవారం నాడు ధ్రువీకరించారు. పాట్నాలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని, బీజేపీ-జేడీయూ కూటమికి మిగతా.. 2లో

## పత్తిని కేంద్రమే కొనుగోలు చేస్తుంది



- సీసీఐ ద్వారా క్వింటాల్ పత్తి రూ.8,110కు కొనుగోలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్17అక్షరగళం): కేంద్ర ప్రభుత్వం పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. క్వింటాల్ పత్తి రూ.8,110 ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో పత్తి సాగు ఉత్పత్తి పెరుగుతోందని.. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ముందు ఉందన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మిగతా.. 2లో




## లొంగిపోయిన మావో అగ్రనేత ఆశన్న

- ఆశన్న సహా 208మంది మావోల లొంగుబాటు
- భారీగా ఆయుధాలు అప్పగింత
- వారి పునరావాసానికి ఏర్పాట్లు చేస్తామన్న ఛత్తీస్‌ఘడ్ సిఎం

రాయపూర్,అక్టోబర్17అక్షరగళం): మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ పోలీసుల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు. వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 153 ఆయుధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే-47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి. మిగతా.. 2లో



## బీసీ బిల్లును అడ్డుకున్న పాపం బిజెపిదే

- బిల్లును అడ్డుకోవడం వల్లనే బీసీ బంద్
- బంద్‌కు పూర్తి బాధ్యత బిజెపిదే
- దమ్ముంటే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి
- బిజెపిని డిమాండ చేసిన డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం,అక్టోబర్17అక్షరగళం): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు దేశంలో ఎక్కడా లేని విధంగా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలిసారిగా సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన నిర్వహించామని.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూసినట్లు తెలిపారు. చట్ట సభల్లో మిగతా.. 2లో

## స్థానిక ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

- ప్రభుత్వం, ఈసీని ప్రశ్నించిన హైకోర్టు
- గడువు కోరడంతో విచారణ రెండు వారాలకు వాయిదా



హైదరాబాద్,అక్టోబర్17 అక్షరగళం): తెలంగాణ స్థానిక ఎన్నికల నిర్వహణపై కీలక పరిణామాలు చూటు చేసుకుంటున్నాయి. తాజాగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై రీనోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్ లో దాఖలు చేశారు. సుప్రీంకోర్టు మిగతా.. 2లో




## నవీన్ యాదవ్ నామినేషన్

- యూసుఫ్ గూడ నుంచి భారీ ర్యాలీతో రాక
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, వివేక్

హైదరాబాద్, అక్టోబరు17 అక్షరగళం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. మిగతా.. 2లో

## కాంగ్రెస్‌లో కరుగుతున్న కొండ



- ఏకాకిని చేసే ప్రయత్నాలు మొదలు
- వరుస ఘటనలే నిదర్శనమంటున్న పరిశీలకులు

వరంగల్,అక్టోబరు17 అక్షరగళం): వరంగల్ కాంగ్రెస్‌లో రాజకీయ కుంపటి రగులుతూనే ఉంది. వరుసగా జరుగుతున్న పరిణామాలు మరింత రోత పుట్టిస్తున్నాయి. తాజా పరిణామాల వెనక ఉన్నది సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డేనని కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఆరోపించారు. తమపై రెడ్డికులాల ఆధిపత్యం రదుస్తోందని ఆమె ఘాటుగానే వ్యాఖ్యానించారు. మిగతా.. 2లో

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

# భగ్గుమంటున్న బంగారం

(మొదటి పేజీ తరువాయి)

స్తున్నది. మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,35,250గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,21,725కి చేరుకుంది. ఇక కిలో వెండి ధర రూ.1,81,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో అతివిలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటం వల్లనే దేశీయంగా బంగారం ధరలు గరిష్ఠ స్థాయికి చేరుతున్నాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోతుండటం, అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు, ఫెడరల్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించనుండటం, చైనా-అమెరికా మధ్య టారిఫ్‌లు కూడా ధరలు దూసుకుపోవడానికి ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నాయి. మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా ఓ కారణంగా చెబుతున్నారు. అంతేకాదు, ధనత్రయోదశి. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. బంగారం కొనుగోలు చేస్తే సంపద, అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. ఆరోజు బంగారం కొనుగోళ్లు ఊపందు కుంటాయి. ఇది కూడా ధరల పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది.

# బిసి బంద్‌కు జాగృతి సంపూర్ణ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

కవిత మద్దతు తెలపాలని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. అయితే, ఆర్. కృష్ణయ్య లేఖపై స్పందించారు కవిత. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ పాస్ చేసిన బిల్లును ఆమోదించకుండా నేటి వరకు పెండింగ్‌లో పెట్టిన బీజేపీ ఇప్పుడు బంద్‌లో పాల్గొంటుందని... అంటే బీసీ రిజర్వేషన్ల బిల్లులు పాస్ చేసినట్లు భావించాలా..? అని ప్రశ్నించారు. అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిల్లులు పాస్ చేసి కేంద్ర ప్రభుత్వంపై కొట్లాడకుండా బీసీ రిజర్వేషన్లపై ఉత్తుత్తి జీవో ఇచ్చిన కాంగ్రెస్ తామే ముందుండి బంద్ చేయిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని కవిత విమర్శించారు.

# పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

4వ తరగతి వరకు నూతన స్కూల్స్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలి. అక్కడ కార్పొరేట్ స్కూల్ స్థాయిలో అన్ని వసతులతో విద్యను అందించే ఏర్పాటు చేయండి. విద్యార్థులకు పాలు, బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయండి. 2026 జూన్ లో అకడమిక్ ఇయర్ నుంచి అమలు జరిగేలా యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్లాలి.

# స్థానిక ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

ఈసీ నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ న్యాయవాది సురేందర్ పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. వాదనలు విన్న హైకోర్టు.. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించింది. ఎన్నికలు నిర్వహణపై సమాధానం చెప్పేందుకు రెండు వారాల సమయం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ప్రభుత్వం, ఈసీ కోరింది. దీంతో హైకోర్టు ఇందుకు అంగీకరించి రెండు వరాల సమయం ఇచ్చింది. అనంతరం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచూ ప్రభుత్వం జారీచేసిన జీవోను హోకోర్టు కొట్టివేడంతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్ చేస్తూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ జీవో ప్రకారమే ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే హైకోర్టు ఆ జీవోపై స్టే విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టకుండానే అత్యున్నత న్యాయస్థానం సైతం రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేయడంతో రిజర్వేషన్ల పంచాయితీ అగమ్యగోచరంగా మారింది. దీనితో స్థానిక ఎన్నికల పక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అటు ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. గురువారం సుప్రీంకోర్టు కూడా ఎన్నికలకు వెళ్లమని చెప్పింది కదా అంటూ వ్యాఖ్యానించింది. ఎన్నికలుపెట్టుకోవచ్చని ఓరల్‌గా మాత్రమే చెప్పిందని.. ఆర్డర్‌లో ఎక్కడాచెప్పలేదని ఎలక్షన్ కమిషన్ తరఫు న్యాయవాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాశామని కోర్టుకు తెలిపారు. బీసీ రిజర్వేషన్లలను 42 శాతానికి పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చాం కాబట్టే దాన్ని సస్పెండ్ చేశాం. మళ్లీ రిజర్వేషన్లను గూర్చి ప్రభుత్వంతో చర్చించాకే రీ నోటిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. రెండు వారాల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం కోర్టును కోరడంతో తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

# కాంగ్రెస్‌లో కరుగుతున్న కొండ

(మొదటి పేజీ తరువాయి)

వీరంతా కలసి తమ కుటుంబాన్ని టార్గెట్ చేశారని మండుతున్నారు. తమది కాంగ్రెస్ రక్తమని చెప్పుకుంటున్న కొండా సురేఖ మధ్యలో కొన్ని సంవత్సరాలు మాత్రం బీఆర్‌ఎస్‌లో కొనసాగారు. ఈ క్రమంలో టీడీపీలో పనిచేసి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు తమను టార్గెట్ చేశారని కొండా సురేఖ ఆరోపిస్తున్నారు.వీరికి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్ని విధాలా సహకరిస్తున్నారని గాంధీభవన్ వేదికగా ఆరోపించారు. ఇదే విషయమై అప్పటి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ప్రస్తుత ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వరకు, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నుంచి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే వరకు ఫిర్యాదు చేస్తూ వచ్చారు. మరోవైపు, కొండా సురేఖ, కొండా మురళీధర్‌రావుకు వ్యతిరేకంగా కూడా ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. నిత్యం వార్తల్లో ఉండటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, తమది మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ అని చెప్పడం, గల్లీ నుంచి ఢిల్లీ దాకా పరిచయాలు ఉండడం, సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ పేరుపెట్టి పిలిచే నాయకురాలిగా పేరు తెచ్చుకోవడంతోపాటు, చెప్పినట్టు వినరనే కారణంతో కొండా దంపతులను రేవంత్‌రెడ్డి టార్గెట్ చేశారని వీరు ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి నటుడు నాగార్జున అంశంలోనే సురేఖపై వేటు తప్పదన్న వార్తలు వినిపించాయి. అప్పట్లో ఆమెను తప్పించాల్సిందేనని వైరివర్గం అధిష్ఠానానికి ఫిర్యాదు కూడా చేసింది. ఈ ఫిర్యాదుల వెనక కూడా రెడ్డి సామాజికవర్గమే ఉన్నదని, రేవంత్‌రెడ్డి అండ చూసుకుని తమను వేధిస్తున్నారని అప్పట్లో కొండా దంపతులు ఆరోపించారు. ఇక గనలు వ్యవహారానికి వస్తే .. అక్రమాల నేపథ్యంలో దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి రూ.300 కోట్ల జరిమానా విధిస్తూ రాష్ట్ర పర్యావరణ శాఖ నోటీసులు పంపింది. ఆ నోటీసులతో బిత్తరపోయిన కంపెనీ యాజమాన్యం పలువురు ప్రభుత్వ పెద్దల వద్ద మొరపెట్టుకున్నట్టు సమాచారం. దీంతో బంతి తన కోర్టులోకి వచ్చిందని నిర్ధారించుకున్న ఓఎస్డీ సుమంత్.. కంపెనీ యాజమాన్యంతో బేరసారాలు చేసినట్టు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో జరిగిన వ సూళ్ల, పంపకాల తేడాతో వ్యవహారం రచ్చకెక్కినట్టు చెప్తున్నారు. తాజా పరిణామాలపై సురేఖ కూతురు సుస్మిత సెల్ఫీవీడియో ద్వారా అందించిన వివరాలతో తీగ లాగితే హుజూర్‌నగర్‌లోని సున్నపు రాయి నిక్షేపాల డొంక కదులుతున్నదని స్పష్టమవుతున్నది.

కేసీఆర్ ప్రభుత్వ హయాం లో ఇదే అంశంపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తు జరిపారు. సుల్తాన్‌పూర్ రిజర్వు ఫారెస్టులో ఎన్‌సీఎల్ అనుమతికి మించి సున్నపురాయి నిక్షేపాలను తవ్వుతున్నట్టు దర్యాప్తులో తేలింది. ఆ నివేదికలోని సిఫారసు మేరకు రాష్ట్ర గనులు, భూ గర్భ శాఖ 2021లోనే ఆ కంపెనీకి రూ.91.42 కోట్ల జరిమానా కూడా విధించింది. అయితే తాజా ఈ-టెండర్లలో ఎన్‌సీఎల్ సరిగ్గా ఇదే బ్లాకుకు బిడ్ దాఖలు చేసి మైనింగ్ లీజు దక్కించుకోవడం గమనార్హం. కానీ మిగిలిన రెండు బ్లాకుల జోలికి వెళ్లలేదు. గనుల వ్యవహారంలో రూ.1500 కోట్ల స్కాం జరిగిందని వెంటక్ రెడ్డి అనే వ్యక్తి పేర్కొన్నారు. దీనిపై అతను సమాచారశాఖ ద్వారా ఫిర్యాదు చేస్తే... ఆ ఫిర్యాదును రాష్ట్ర గనుల శాఖకు పంపినట్టు సమాధానం ఇచ్చి చేతులు దులుపుకొన్నది. మొత్తంగా ఇప్పుడు పార్టీలో కొండా సురేఖ ఏకాకి అయ్యారనే అంటున్నారు. రాజకీయంగా ఆమెను ఒంటరి చేశారని అంటున్నారు.

# లొంగిపోయిన మావో అగ్రనేత ఆశన్న

(మొదటి పేజీ తరువాయి)

ఈ లొంగుబాటుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మాట్లాడారు. ఇది ఛత్తీస్‌గఢ్‌కే కాదు దేశం మొత్తానికి చరిత్రాత్మకమైన రోజు. హింసను వీడి జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని మేం వారిని కోరుతూ వచ్చాం. ఇప్పుడు వారికి నైపుణ్యాలు కల్పించి, పునరావాసానికి ఏర్పాటు చేస్తాం అని వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిసిన గంటల వ్యవధిలోనే ఆశన్న లొంగుబాటు ప్రకటన వచ్చింది. ఇద్దరు అగ్రనేతలు పోరాటాన్ని వీడటంతో మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్‌వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం అప్పటి హనుమకొండ మండలం కాజీపేటలోని ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ)కు నాయకత్వం వహిస్తూ ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. కీలక దాడులకు ఆశన్న వ్యూహకర్త. దండకారణ్య సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా రూపేశ్ పేరుతో వ్యవహరించిన ఆశన్న.. ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డిలపై బాంబులు పేల్చి హత్యాయత్నం, 1999లో ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర హత్య, 2000లో నాటి హోంమంత్రి మాధవరెడ్డి హత్యలాంటి ఘటనలకు నేతృత్వం వహించినట్లు చెబుతారు.

# బంద్ ఫర్ జస్టిస్.. నేడు రాష్ట్ర బంద్

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొంటున్నామని వివరించారు. బీజేపీ నేతలు ఎన్ని మాటలు చెప్పినా బీసీల హృదయాల్లో చోటు సంపాదించుకోలేరని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఈ బంద్‌లో పాల్గొనాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందని ఆ పార్టీ భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రేపటి బీసీ బంద్‌ని జయప్రదం చేయాలని సూచించారు. రేపటి బీసీ బంద్‌కి అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందని ఉద్ఘాటించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశంలో జనగణనలో భాగంగా కులగణన జరగాలని కోరారని పేర్కొన్నారు

కాంగ్రెస్ డెడికేషన్ కమిషన్ పెట్టి శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేసిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ వేశామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలని ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ కలిసి బీసీ బంద్‌కి మద్దతు కోరారని గుర్తుచేశారు. ఆర్. కృష్ణయ్యపై గురుత్వర బాధ్యత ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్. కృష్ణయ్య తెలంగాణలో చేసే ప్రయత్నం ఢిల్లీలో కూడా చేయాలని కోరారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లని ఆర్. కృష్ణయ్య ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించాలని సూచించారు. తాము కూడా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. వారితో కలిసి ఢిల్లీకి వచ్చి ప్రధాని మోదీని, రాష్ట్రపతిని కలుస్తామని తెలిపారు. కాంగ్రెస్ బీసీ కులగణన చేసి, 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఉద్ఘాటించారు. బీసీలకు న్యాయం చేసి బీజేపీ క్రెడిట్ తీసుకున్న తమకు నష్టం లేదని చెప్పుకొచ్చారు. కేబినెట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లుకి ఆమోదం తెలిపి గవర్నర్‌కి పంపించామని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ అంశంపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ చర్చిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వాతంత్రం ఉంటుందని ఉద్ఘాటించారు. అప్పుడప్పుడూ సమస్యలు వస్తాయని.. అవి సద్దుమనుగుతాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌లో నియంత పాలన ఉండదని.. సమస్యలన్నీ సద్దుమనుగుతాయని తెలిపారు. ఇవన్నీ చిన్న చిన్న సమస్యలేనని, టీ కప్పులో తుఫాన్ లాంటివేనని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఆస్తులు అమ్ముకుని కాంగ్రెస్‌ను కాపాడా..!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన నలుగురికి మంత్రి పదవులు ఇచ్చారని, తనతోపాటు బీజేపీ నుంచి వచ్చిన వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి, అతని కుమారుడికి ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. తనను మాత్రం పక్కన పెట్టారని మండిపడ్డారు. పార్టీ కోసం ఆస్తులు అమ్ముకుని కష్టపడిన నన్ను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చి తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు మంత్రి పదవి రాకుండా కొందరు నాయకులు అడ్డుకుంటున్నారని చెప్పారు. ఎక్సైజ్ నిబంధనలకు తోడు నియోజకవర్గ ఎమ్మెల్యే సొంత నిబంధనలు ఖరారు చేయడం మునుగోడు నియోజకవర్గంలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిబంధనల పేరుతో జారీ చేసిన అంశాలపై సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. దీనిపై ఆయన స్పందిస్తూ కేవలం ప్రజలకు మేలు చేసేందుకే అని అన్నారు. నియోజకవర్గంలోని మునుగోడు, చండూరు, గట్టుప్పల్, నాంపల్లి, మర్రిగూడ, నాంపల్లి, చౌటుప్పల్, సంస్థన్ నారాయణపురం మండలాలలో వైన్ షాప్స్ టెండర్స్ వేసే ఆశావహులు టెండర్లు వేయాలంటే షరతులు పాటించాలని హుకుం జారీ చేశారు. షరతులు పాటించని వారు టెండర్స్ వేయవద్దని,వైన్ షాప్స్ నిర్వాహకులు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మద్యం అమ్మాలని సూచించారు . మండలానికి చెందిన స్థానికులు మాత్రమే టెండర్లు వేయాలని, ఇతర మండలానికి చెందిన వ్యక్తులు టెండర్లు వేయవద్దని స్పష్టం చేశారు. వైన్ షాప్‌లు ఊరి బయట మాత్రమే పెట్టాలని,వైన్ షాప్ కు అనుబంధంగా పర్మిట్ రూమ్ ఉండవద్దన్నారు. ముఖ్యంగా బెల్ట్ షాపులకు మద్యం అమ్మవద్దని , లాటరీ విధానంలో వైన్స్ షాప్ లు దక్కించుకున్న ఓనర్స్ సిండికేట్ కాకూడదని పేర్కొన్నారు. ఈ రూల్స్ రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీతో సంబంధం లేదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, బెల్టు షాప్‌ల నిర్మూలన, మహిళల సాధికారతే తన ఉద్దేశమని పేర్కొన్నారు.

# బీహార్ మహాఘట్‌బంధన్ సిఎం అభ్యర్థిగా తేజస్వీ యాదవ్

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా విపక్ష ఐక్య కూటమి పోటీకి కట్టుబడి ఉందని చెప్పారు. 'తేజస్వి యాదవ్ మహాఘట్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి. సీట్ల షేరింగ్ పక్రియ త్వరలోనే ఖరారవుతుంది' అని సింగ్ తెలిపారు. సింగ్‌తోపాటు ఇంతకుముందు కాంగ్రెస్ ఎంపీ తారిఖ్ అన్వర్ సైతం సీఎం అభ్యర్థిత్వంపై తేజస్వి యాదవ్‌కు మద్దతుగా మాట్లాడారు. తేజస్విని సీఎం అభ్యర్థిగా ప్రకటించడంలో తప్పేమిలేదన్నారు. ఎన్డీయే కూడా తమ ముఖ్యమంత్రి అభ్యర్థిపై స్పష్టత ఇవ్వాలన్నారు. తేజస్వి సీఎం అభ్యర్థిత్వంపై మహాకూటమిలో ఎలాంటి ఇబ్బందులు కనిపించనప్పటికీ సీట్ల పంకాల విషయంలో టెన్షన్ కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ 48 మంది అభ్యర్థుల జాబితాను గురువారం నాడు ప్రకటించింది. అయితే భాగస్వామ్య పక్షాలతో విభేదాలు ఇంకా సమసిపోలేదు. వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) చీఫ్ ముఖేష్ సహాని సీట్ల షేరింగ్‌పై అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోందని తారిఖ్ అన్వర్ తెలిపారు. తాము కూడా పొరపాటు చేశామని, తగినంత సమయం చేతిలో ఉన్నా ముందే సీట్ల షేరింగ్‌పై ఒక అవగాహనకు వచ్చి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు.

కాగా, సీట్ల పంపకాల విషయంలో ఎలాంటి అసంతృప్తులకు తావీయకుండా ఎన్డీయే వ్యూహాత్మకంగా వ్యవహరించింది. జేడీయూ, బీజేపీలు చెరో 101 సీట్లలో పోటీ చేసేందుకు నిర్ణయించాయి. చిరాగ్ పాశ్వాన్ లోక్ జన్‌శక్తి పార్టీ (రామ్ విలాస్) 29 స్థానాల్లోనూ, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ సారథ్యంలోని హిందుస్థాన్ అవామ్ మోర్చా (సెక్యులర్), రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహ రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) చెరో 6 స్థానాల్లోనూ పోటీ చేసేందుకు అవగాహన కుదిరింది. బిహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 14న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# నవీన్ యాదవ్ నామినేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. నవీన్ యాదవ్ యూసుఫ్ గూడ నుంచి నామినేషన్ వేయడానికి భారీ ర్యాలీగా వెళ్లారు. ర్యాలీకి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఇతర ముఖ్య నేతలు తరలివచ్చారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ పోటీ చేస్తుండగా.. బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. అలానే బీఆర్ఎస్ పార్టీ నుంచి దివంగత నేత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత బరిలో నిలిచారు. ఈ ముగ్గురు జూబ్లీహిల్స్ నియోజకవర్గం స్థానికులు కావడంతో ఉపఎన్నిక ఆసక్తికరంగా మారింది. మాగంటి సునీత మినహా మిగిలిన ఇద్దరు అభ్యర్థులు గత కొన్ని ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే పోటీ చేస్తూ వస్తున్నారు. అయితే స్థానికంగా ఈ ముగ్గురికి గట్టి పట్టుంది. హైదరాబాద్ లోని యూసఫ్‌గూడకు చెందిన వ్యక్తి నవీన్ యాదవ్. ఈయన బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లో డిగ్రీ పొందారు. ఆయన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ సిటీలో పేరున్న సోషల్ వర్కర్. నవీన్ యాదవ్ తొలిసారి 2014లో మజ్లిస్ పార్టీ తరపున జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి కేవలం 9 వేల పైచిలుకు స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం చవిచూశారు. 2018లో ఇక్కడి నుంచే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి..భారీగానే ఓట్లు సంపాదించారు.

2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లో చేరిన నవీన్ యాదవ్.. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అప్పటి నుంచి పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో ముచ్చటగా మూడోసారి జూబ్లీహిల్‌స్లో పోటీ చేస్తున్నారు. ఈ సారి ఎలాగైనా గెలవాలనే దృఢ నిశ్చయంతో నవీన్ యాదవ్ ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణ త్రోబాల్ అసోషియేషన్ కు రాష్ట్ర అధ్యక్షుడిగా నవీన్ యాదవ్ కొనసాగుతున్నారు. ఈ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ కు ఎంఐఎం మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.

# బిసి బిల్లును అడ్డుకున్న పాపం బిజెపిదే

(మొదటి పేజీ తరువాయి)

ఏకగ్రీవాగంగా ప్రవేశ పెట్టామని.. గవర్నర్, రాష్ట్రపతికి పంపించినట్లు తెలిపారు. అయితే తాము పాస్ చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతోందని ఆరోపించారు. ఇది బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని భట్టి మండిపడ్డారు. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేశామని.. బీజేపీ పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు పాస్ చేయడమే కాకుండా న్యాయస్థానాలకు కూడా వెళ్తోందన్నారు. ఓబీసీపై సుప్రీం కోర్టులో ప్రముఖ న్యాయవాదులు పోరాడుతున్నారని తెలిపారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో పెట్టకపోవడం వల్లే.. ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ కష్టమని సుప్రీం కోర్టు చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ పార్టీ వల్లనే బీసీ రిజర్వేషన్ల అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. దీని వల్ల రాష్ట్రంలో ఓబీసీ సంఘాలన్నీ కూడా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. రేపు జరిగే ఓబీసీ బంద్‌కు ప్రధాన కారణం బీజేపీ అని అన్నారు. ఓబీసీల బంద్‌లో అన్ని పార్టీల సంఘాలు ఆమోదం తెలిపాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఓబీసీ బిల్లుపై ఎందుకు మొండి వైఖరి చూపిస్తున్నారని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లను ప్రశ్నించారు. ప్రధానితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఓబీసీ బిల్లును ఎందుకు పాస్ చేయించడం లేదని నిలదీశారు.

బిల్లులకు అడ్డుపడుతూ మళ్ళీ కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క బీసీలే కాదు అన్ని వర్గాల ప్రజలు కూడా.. బీజేపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ చేస్తున్న ఆగడాలను అందరూ గమనిస్తున్నారని.. కమలం పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ఈ బంద్ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

ఈ విషయంపై ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా ఆయన సమయమివ్వలేదని చెప్పారు. ఈ అంశంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రధాని సమయం ఇస్తే.. అఖిలపక్షంతో కలిసి వచ్చేందుకు సీఎం రేవంత్ సిద్ధమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేశారు.బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేందుకు భాజపా ఎందుకు అడ్డుపడుతోందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ భాజపా వైఖరికి వ్యతిరేకంగా జరుగుతోందన్నారు. దీనికి కాంగ్రెస్ శ్రేణులతో పాటు అందరూ మద్దతు తెలపాలని కోరారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు డిప్యూటీ సీఎం. సింగరేణి కార్మికులకు దీపావళికి 400 కోట్ల రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. సింగరేణి ఖమ్మం జిల్లా నుండే మొదలైందని.. ఇక్కడ మొదలై రాష్ట్రం అంతటా వ్యాపించిం దన్నారు.

# పత్తిని కేంద్రమే కొనుగోలు చేస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా సాగవుతున్న పంట పత్తి అని..రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని తెలిపారు. 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. పత్తి రైతులు దళారుల చేతిలో పడి మోస పోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. కొనుగోలు కేంద్రాలను మరో 12పెంచామని.. మొత్తం 122 కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు కేంద్రమంత్రి.

పత్తి సాగు ఉత్పత్తిలో సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. తొమ్మిది ప్రాంతీయ భాషల్లో పత్తి సాగుకు సంబంధించి కిసాన్ యాప్‌ను తీసుకొచ్చామని.. యాప్‌లో రైతులు నమోదు చేసుకుంటే.. స్లాట్ ద్వారా పత్తిని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని అన్నారు. పత్తి శుద్ధి, రవాణా కోసం జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. హై డెన్సిటీ ఎలాంటేషన్ వల్ల పంట దిగుబడి డబుల్ అవుతుందని తెలిపారు. మహారాష్ట్ర అకోలా ప్రాంత ప్రజలు హై డెన్సిటీ ఎలాంటేషన్ చేస్తున్నారని.. హై డెన్సిటీ ఎలాంటేషన్‌పై అవగాహన కోసం అవసరమైతే రైతులను మహారాష్ట్రకు తీసుకెళ్తామని చెప్పారు.

వచ్చే ఏడాది నుంచి మన రైతులు హై డెన్సిటీ ఎలాంటేషన్ చేసేలా పని చేస్తామన్నారు. కిసాన్ యాప్ దీపావళి నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పదేళ్లలో కనీస మద్దతు ధర వంద శాతం పెరిగిందన్నారు. నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నా యని.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపుతున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# గ్రీన్ కార్డ్ లాటరీలోనూ భారత్‌పై ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

2028 వరకు అవకాశం లభించదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రీన్ కార్డ్ లాటరీ కార్యక్రమంలో గత ఐదేళ్లలో అమెరికాకు తక్కువ వలసలు ఉన్న దేశాల దరఖాస్తుదారులను ఎంచుకుంటున్నట్లు తెలిపాయి. ఏటా 50 వేల మంది లోపు అమెరికాకు వలసవచ్చే దేశాలకే అవకాశం ఇస్తున్నట్లు సమాచారం. అమెరికాలో అన్ని దేశాలకు చెందిన వలసదారులకు అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీసా లాటరీలో పాల్గొనడానికి అనుమతి ఉన్న దేశాలకు తాజా వీసా కేటాయింపులను ప్రకటించారు. గత కొన్నేళ్లుగా భారత్ నుంచి అమెరికాకు అధికంగా వలసలు ఉండడంతో భారతీయులకు ఈ వీసా కార్యక్రమానికి కావాల్సిన అర్హత పరిమితి మించిపోయిందని.. అందువల్లే ఈ లాటరీలో పాల్గొనడానికి వారికి అవకాశం ఇవ్వట్లేదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. యూరోపియన్ (75,610) వలసదారుల సంఖ్య కంటే ఎక్కువ. 2023లో 78,070 మంది భారతీయులు అమెరికాకు వలస వచ్చారు. ఈ రికార్డుల ఆధారంగా 2028 వరకు భారతీయులను యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలకు అనర్హులుగా నిర్ణయించినట్లు తెలిపింది. ఇప్పటికే ఇమిగ్రేషన్ విధానంలో అమెరికా తీసుకుంటున్న కఠిన చర్యలతో సమస్యలు ఎదుర్కొంటున్న భారతీయులకు ఇది మరో ఎదురుదెబ్బగా మారింది. ఈ లాటరీకి 2026 వరకు అర్హత సాధించని ఇతర దేశాల్లో చైనా, దక్షిణ కొరియా, కెనడా, పాకిస్థాన్ ఉన్నాయి. పెరోల్ ఫీజుపై అమెరికా సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో కొన్నిరకాల వలసదారులకు అవసరమయ్యే పెరోల్ ఫీజును 1,000 డాలర్లకు పెంచుతున్నట్లు ప్రకటించింది. వీసా లేదా ఇతర అధికారిక పత్రాలు లేకుండా అమెరికాలో ప్రవేశించడానికి, ఉండటానికి పెరోల్ అనేది తాత్కాలిక అనుమతి. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే దీనిపై విదేశీయులను అమెరికాలోకి అనుమతిస్తారు.

ఇటీవల ట్రంప్ ప్రవేశపెట్టిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లులో ఈ పెరోల్ ఫీజును తప్పనిసరి చేశారు. ప్రస్తుతం దీని ఆధారంగా అమెరికాలోకి ప్రవేశించాలంటే విదేశీయులు 1,000 డాలర్ల పెరోల్ రుసుమును చెల్లించాలి. వీటిలో ప్రారంభ పెరోల్, రీ-పెరోల్, పెరోల్ ఇన్ ప్లేస్ లేదా డీహెచ్ఎస్ కస్టడీ నుంచి పెరోల్ వంటివి ఉంటాయి. ఈ రుసుము ఇప్పటికే ఉన్న ఏదైనా ఇతర ఇమిగ్రేషన్ సర్వీస్ ఫైలింగ్ లేదా బయోమెట్రిక్ రుసుముకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇమిగ్రేషన్ అధికారులు సూచించిన సమయం లోపు ఈ రుసుమును చెల్లిస్తేనే పెరోల్ పొందడానికి అనుమతినిస్తారు. ఈ తరహా ఆంక్షలపై ఎన్నారైలు మండిపడుతున్నారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
తెలంగాణ రౌండప్

## డీజీపీకి శుభాకాంక్షలు తెలిపిన అసిఫ్ అలీ



**ఆమనగల్లు, అక్టోబర్ 17 (అక్షర గళం):** నూతనంగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిని రేవంత్ మిత్ర మండలి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అసిఫ్ అలీ శుక్రవారం హైదరాబాద్ లోని డిజిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించిన డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసిఫ్ అలీ మాట్లాడుతూ.. డీజీపీ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శివదర్ రెడ్డి సారధ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ సజావుగా సాగాలని ఆయన అన్నారు.



## బీసీ బందుకు సర్పంచుల సంఘం పూర్తి మద్దతు

**ఆమనగల్లు, అక్టోబర్ 17 (అక్షర గళం):** తెలంగాణ రాష్ట్రంలో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాలు చేపట్టిన బంద్‌కు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సంఘం నేతలు తెలిపారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలకు న్యాయమైన ప్రాతినిధ్యం లభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడమే లక్ష్యంగా బంద్ చేపడుతున్న బీసీ సంఘాలకు సర్పంచుల సంఘం మద్దతు సంపూర్ణంగా ఉంటుందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు విద్య,ఉద్యోగ మరియు స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్లు చట్ట బద్ధంగా బీసీలకు అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా బీసీ సంఘాలు రేపు చేపడుతున్న బందు కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సర్పంచుల జెఏసి అధ్యక్షుడు యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ వివిధ మండలాల అధ్యక్షులు శారద, బీరప్ప, అంజయ్య గౌడ్, రాజేందర్, నాగయ్య తదితరులు ఉన్నారు.

## స్వయంకృషే యువతకు శ్రీరామరక్ష

**- దశరథ్ నాయక్**

**ఆమనగల్లు, అక్టోబర్ 17 (అక్షర గళం):** యువతకు స్వయంకృషే శ్రీరామరక్ష అని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. యువత స్వయంకృషితో ఎదిగినప్పుడే



దేశంలో అభివృద్ధిలో పయనిస్తుందని తెలిపారు. శుక్రవారం కడ్తాల్ మండలం గనుగు మర్ల తండ గ్రామపంచాయతీకి చెందిన విస్లావత్ సురేష్ నూతనంగా ఏర్పాటు చేసిన టెంట్ హౌస్ ను రిబ్బెన కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయంకృషితో టెంట్ హౌస్ వ్యాపారం ప్రారంభించిన సురేష్ దంపతులను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్, డైరెక్టర్ సేవ్య నాయక్, మాజీ ఎంపిటిసి ప్రియా రమేష్, నాయకులు పాండు నాయక్, శీను నాయక్, భీమన్ నాయక్, శంకర్ నాయక్, పాండు నాయక్, రాజు నాయక్, మదన్ లాల్, అర్జున్, సేవ్య, సక్రు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ శ్రీ బ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో

## ఘనంగా అన్నదాన కార్యక్రమం

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 17, (అక్షర గళం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ లో శ్రీ శ్రీ బ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో ఏనుగుల మాధవ రెడ్డి, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి ల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన



శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిధిగా పాల్గొని అయ్యప్ప స్వాములకు, భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు మాలవిరమణ వరకు నిత్యఅన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం అరుణ్ గురుస్వామి అయ్యప్ప స్వాములకు, భక్తులకు భక్తి స్వామి వారి ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో యువజన



నాయకుడు బుచ్చి రెడ్డి, కోలన్ శ్రీనివాస్ రెడ్డి, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, పార్టీ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## కన్నుల పండుగగా ధర్మ విజయ యాత్ర

- **వివిధ రకాల కళారుల నృత్యాలతో మారు మ్రోగిన ఎన్.సి.యల్ కాలనీ.**
- **స్వామివారికి స్వాగతం పలికిన వేదపండితులు రవిచంద్ర శర్మ.**
- **స్వామివారిని దర్శించుకున్న పలువురు నాయకులు.**
- **గజమాలతో స్వామివారికి ఘన స్వాగతం పలికిన కాలనీవాసులు**



**కొంపల్లి, అక్టోబర్-17(అక్షర గళం):** కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నార్త్ ఎన్.సి.యల్. కాలనీలో శుక్రవారం నాడు ధర్మ విజయ యాత్ర కార్యక్రమంలో భాగంగా శ్రీ శారదా శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ స్వామి వారు అనుగ్రహ దీవెనలతో శ్రీశ్రీశ్రీ విధు శేఖర భారతి మహాస్వామి రాకతో కాలనీలోని వివిధ కళాకారుల నృత్యాలతో కోలాటం దరువులతో వివిధ రకాల వేషధారణలతో డప్పు డోలు ధరువులతో శ్రీ దుర్గ దేవి సేవ సమితి వేద పండితులు రవిచంద్ర శర్మ స్వామి వారికీ స్వాగతం పలికారు.స్వామి వారి రాకతో ప్రజాప్రతినిధులు.నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.స్థానిక ఎమ్మెల్యే కే.పి.వివేకానంద్ గౌడ్ తోపాటు.మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేంద్ర.కామారెడ్డి ఎమ్మెల్యే. కాటేపల్లి వెంకట్ రామ్ రెడ్డి.నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.లు పాల్గొని స్వామి వారి దీవెనలు పొందారు.అనంతరం వారు మాట్లాడుతూ వేద, శాస్త్ర, ఉపనిషత్తులపై విశాలమైన పరిజ్ఞానం కలిగిన శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి వారు మా కుత్బుల్లాపూర్ ప్రాంతానికి రావడం ఎంతో సంతోషకరమైన విషయమని, ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యానికి చేపట్టిన ఈ యాత్ర ద్వారా సనాతన ధర్మ పరిరక్షణ, మనలోని సద్గుణాలు, సత్సం కల్పాలు పెంపొందించాలన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ, ప్రచారం, ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించడమే లక్ష్యంగా శృంగేరీ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన “ధర్మ విజయ యాత్ర కొంపల్లి మున్సిపాలిటీ ప్రజలు మరియు కుత్బుల్లాపూర్ ప్రజలకు శుభసూచికమని ఆనందం వ్యక్తం చేసారు.ఇంతటి కార్యక్రమానికి ప్రతిన పూనిన పండితులు రాచర్ల హైందవి - రవిచంద్ర శర్మకి రుణపడి ఉంటామని రానున్న రోజుల్లో మరింత ఐక్యతను పెంపొందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శిరీష ప్రవీణ్ రావు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, శ్రీదుర్గా సేవా సమితి సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు

**- ఏఐసీసీ పరిశీలకుడు, ఎంపీ రాబర్ట్ బుష్**

**ఆమనగల్లు, అక్టోబర్ 17 (అక్షర గళం):** పార్టీ కోసం పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఏఐసీసీ పరిశీలకుడు తమిళనాడు ఎంపీ రాబర్ట్ బుష్ స్పష్టం చేశారు. పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడుగుల మండలాలకు చెందిన పార్టీ నాయకుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమిళ నాడు ఎంపీ రాబర్ట్ బుష్, ఎమ్మెల్సీ దయాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అగ్రనేత రాహుల్ గాంధీ పలు కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు. అబద్దాలు, దొంగ ఓట్లతో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని.. ఓట్ల చోరీ పాలన ఇక సాగదని బిహార్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని బీజేపీ ప్రభుత్వం పెద్దఎత్తున కుట్రలు చేస్తోందని.. ఓట్ల చోరీకి పాల్పడేందుకు పూనుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎంపిక కోసం అభిప్రాయాలు సేకరించేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నామని.. నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి ఈ నెల 22న ఏఐసీసీకి నివేదిక



అందిస్తామన్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు సూదిని రామ్ రెడ్డి, అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, అజీమ్, అంజయ్య గుప్తా, ఆయా మండలాల అధ్యక్షులు భట్టు కిషన్ రెడ్డి, తెల్గమల్ల జగన్, బీచ్య నాయక్, ప్రభాకర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, మాజీ ఎంపీపీ అనిత విజయ్, జిల్లా నాయకులు కృష్ణ నాయక్, కిషన్ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మెకానిక్ బాబా, నాజర్, ఖాదర్ ఖాద్రి, పులికంటి మైసయ్య, హరిలాల్, దేవరశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు

**- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**

**- బీసీ రిజర్వేషన్ల పేరుతో డ్రామా**

**ఆమనగల్లు, అక్టోబర్ 17 (అక్షర గళం):** అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న తలపెట్టిన బంద్ కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ తెలిపారు.

శుక్రవారం పట్టణ కేంద్రంలో మున్సిపల్ అధ్యక్షుడు పత్యనాయక్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల తరహాలోనే 42 శాతం బీసీ రిజర్వేషన్ల పేరుతో డ్రామా ఆడుతోం దన్నారు. కేంద్రంలో 55 ఏళ్ల పాటు అధికారంలో ఉన్నా ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం ప్రయత్నించిందా? అని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే జాతీయ నాయకులతో ఢిల్లీ



వేదికగా ఉద్యమిస్తే కలిసి రావడానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలని చేసిన కుట్రలు పటాపంచల య్యాయని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించే చిత్తశుద్ధి సీఎం రేవంత్ రెడ్డికి లేదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్టబద్ధత కోసం కేంద ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాల్సి ఉండగా పక్కదోవ పట్టించారని ఆరోపించారు.

నామమాత్రంగా జీఓ ఇచ్చి కొత్త నాటకానికి తెర తీసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇకనైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంటులో చట్టం చేయించి షెడ్యూల్ 9లో చేర్చాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, మాజీ వార్డ్ సభ్యుడు వస్పుల సాయిలు, మాజీ ఎంపీటీసీ సరిత పంతు నాయక్, యూత్ వింగ్ అధ్యక్షుడు దేరంగుల వెంకటేష్, ఎనుమల్ల రమేష్, నాగిళ్ల జగన్, వరికుప్పల గణేష్, లండం యాదయ్య, రమేష్ నాయక్, విమలమ్మ, లలిత, పంతు నాయక్, సొమ్లా నాయక్, మహేష్ నేత, గణేష్ నాయక్, బాలు, శివ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**వెల్దండ అక్టోబర్ 17 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని గాన్ గట్టు తండాకు చెందిన మాజీ సర్పంచ్ పత్య నాయక్ చెర్కూర్ గ్రామానికి చెందిన శ్రీను రోడ్డు ప్రమాదంలో గాయపడి వెల్దండ మండల కేంద్రంలోని ఎన్నమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పత్య నాయక్ శ్రీను వాళ్లను పరా మర్శించి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకొని వైద్యులకు మెరుగైన వైద్య అందించాలని డాక్టర్లకు తెలిపారు అనంతరం



కుటుంబాలకు ఖర్చుల నిమిత్తం కోసం 10,000 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ నాగులు నాయక్,మాజీ ఎంపీటీసీ భీమయ్య గౌడ్,మాజీ ఉప సర్పంచ్ నర్సింహా,మాజీ ఎంపీటీసీ నిరంజన్, బచ్చలకూర శ్రీను,మైసయ్య, సత్యం,గొడుగు యాదయ్య,కొండల్ యాదవ్, వెంకటయ్య, ఆలీ జంగిలి ఆనంద్,గాండ్ల జంగయ్య, చర్కా కొండల్, రామచంద్రయ్య, బర్కం గణేష్,తదితరులు పాల్గొన్నారు.





## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**ఆమనగల్లు, అక్టోబర్ 17 (అక్షర గళం):** పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మహేందర్ గౌడ్ అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని చరికొండ గ్రామానికి చెందిన సాప బుర్గమ్మ దుర్గయ్య కు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి నుండి 60 వేల చెక్కు మంజూరైంది. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందిన పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తపల్లి యాదమ్మ, జంగయ్య తదితరులు ఉన్నారు.

## ఆపదలో ఉన్న వారికి అండగా సీఎంఆర్ఎఫ్

**ఆమనగల్లు, అక్టోబర్ 17 (అక్షర గళం):** ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ అన్నారు.



కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మండల పరిధిలోని కర్కల్ పహాడ్ గ్రామానికి చెందిన మల్లెపల్లి వీరయ్య కు వైద్య ఖర్చుల కోసం సీఎం నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చల్లంపల్లి మాజీ సర్పంచ్ నరేందర్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పురుషోత్తం, మల్లేపల్లి పర్వతాలు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్..

**కల్వకుర్తి,అక్టోబర్ 17 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన దున్న జానమ్మ అకాల మృతి విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ శుక్రవారం



జానమ్మ నివాసానికి వెళ్లి ఆమె పార్తివదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్లు మబ్బు రామరాజు నేరేటి చిన్న పరశురాములు నేరేటి నాని కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి 10,000/- ఆర్థిక సహాయం అందజేసిన తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి

**కల్వకుర్తి,అక్టోబర్ 17(అక్షరగళం):** కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన కమ్మరి శ్రీను అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి శుక్రవారం అతని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి దానసంస్కారాలకు




10,000/- ఆర్థిక సహాయం అందజేసి కుటుంబానికి అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. స్థానిక నాయకులు శతాబ్ది టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాస్ రెడ్డి 4,000/- జిల్లెల్ల శ్రీశైలం యాదవ్ మాజీ ఉపసర్పంచ్ 3,000/- అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీటీసీ జోగు రమేష్ గ్రామ ఉపాధ్యక్షుడు తూల తిరుపతి గౌడ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు బర్ల చెన్నయ్య నాయకులు సాకలి సత్తయ్య ఎండి గౌస్ ఎండి వాజిద్ గుర్రంపల్లి శ్రీశైలం జంగారెడ్డి పల్లి మాజీ సర్పంచ్ జంగయ్య మృతుని కుటుంబ సభ్యులు ఉన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

**కల్వకుర్తి, అక్టోబర్ 17 (అక్షరగళం):** మద్యం సేవించి వాహనం నడిపిన కల్వకుర్తి పట్టణం గాంధీనగర్‌కు చెందిన దాసర్ల యాదయ్య ను కోర్టులో హాజరుపరచగా శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జ్ కావ్య జాడ రెండు రోజులు జైలు శిక్షతోపాటు 600 జరిమానా విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.







## ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన జిల్లా అడిషనల్ కలెక్టర్

**మేడ్చల్ ప్రతినిధి, అక్టోబర్ 17, (అక్షర గళం):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లోని జవహర్ నగర్, బాలాజీ నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అడిష నల్ కలెక్టర్ లోకల్ బాడీస్ రాధిక గుప్త , జిల్లా విద్యాశాఖ అధికారి విజయ్ కుమారి, మున్సిపల్ కమిషనర్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక వసతులను విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అత్యధికంగా ఉండడం వలన విద్యార్థులకు కావలసిన అదనపు టాయిలెట్స్ కానీ కాంపౌండ్ వాల్ కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ తదితర అంశాలకు సంబంధించిన అవసరాలను గుర్తించి వాటికి సంబంధించిన ఎస్టిమేషన్స్‌ను తయారు చేసి ఆ పనులను త్వరలో పూర్తి చేసే విధంగా అధికారులను ఆదేశించారు.

అనంతరం పాఠశాలలో ఉన్న వివిధ ల్యాబ్‌లను ఎఆర్, విఆర్ ల్యాబ్ల ను కూడా పరిశీలించారు.

# విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

**- తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్**


**ఆమనగల్లు, అక్టోబర్ 17 (అక్షర గళం):** కాంగ్రెస్ పార్టీ హయాంలో విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, అందులో భాగంగా విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటుందని విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల మరియు మహిళల కళాశాలను తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు డా. చారకొండ వెంకటేష్ స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, హాస్టల్ భవనాలు, ల్యాబ్, లైబ్రరీ తదితర విభాగాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి, వారి విద్యా ప్రగతి, వసతి మరియు ఆహార సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కమిషన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతూ, ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యతోపాటు మంచి భవిష్యత్తు నిర్మించుకునే అవకాశం కలుగుతోంది అని అన్నారు. ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, బోధన విధానాలు, హాజరు, పాఠ్య ప్రణాళిక అమలు, విద్యార్థుల వ్యక్తిగత దృష్టి మరియు



నైపుణ్యాభివృద్ధిపై చర్చించారు. ఉపాధ్యాయుల కృషి మరియు నిబద్ధతను ప్రశంసిస్తూ, విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే విధంగా బోధన కొనసాగించాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ల్యాబ్‌ల ఆధునీకరణ, లైబ్రరీ విస్తరణ, క్రీడా వనరులు, స్వచ్ఛత మరియు భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యాసంస్థలను కూడా సమాన స్థాయిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోందని, విద్యా రంగంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని కమిషన్ సభ్యులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, ఎస్ ఓ అనిత, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.





# నిజమైన సంస్కృతీ, సంప్రదాయాల పునరుజ్జీవన యాత్ర "ధర్మ విజయ యాత్ర"

**- బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 17, (అక్షర గళం):** నిజమైన సంస్కృతీ, సంప్రదాయాల పునరుజ్జీవన యాత్ర "ధర్మ విజయ యాత్ర అని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ, ప్రచారం, ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించడమే లక్ష్యంగా శృంగేరీ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన "ధర్మ విజయ యాత్ర" శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి కొంపల్లి ఎన్సీఎల్ కాలనీకి చేరుకుంది.

ఈ సందర్భంగా నిర్వహించిన స్వాగత సేవలో భాగంగా మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌తో పాటు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కుటుంబసమేతంగా హాజరై శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి వారికి ఘనస్వాగతం పలికి జగద్గురుల అనుగ్రహభాషణంలో పాల్గొనగా శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి వారు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ దంపతులకు వారి దివ్యాశీస్సులను అందజేశారు. అనంతరం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ వేద, శాస్త్ర, ఉపనిషత్తులపై విశాలమైన పరిజ్ఞానం కలిగిన శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి వారు మా కుత్బుల్లాపూర్ ప్రాంతానికి రావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యానికి చేపట్టిన ఈ యాత్ర ద్వారా సనాతన ధర్మ పరిరక్షణ, మనలోని సద్గుణాలు, సత్సంకల్పాలు పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాచర్ల హైందవి – రవిచంద్ర శర్మ, ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మా రెడ్డి, కె.వెంకట్ రాంరెడ్డి, కొంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శిరీష ప్రవీణ్ రావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలాభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, అక్టోబర్ 17 (అక్షర గళం):** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీతో పాటు, ఎస్సీకాలనీలలో ప్రజా అవసరాల మీరకు, డీఎంఎఫ్టీ నిధులు రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం రాత్రి స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతుందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నియోజకవర్గంలో రహదారుల విస్తరణ, అండర్గ్రౌండ్ డ్రైనేజీల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, క్రీడా మైదానాల అభివృద్ధి, శుద్ధ తాగునీటి జలాల పంపిణీ తదితర అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం



జరిగిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా పాలన సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సింగిల్విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీలు రాములుగౌడ్, లక్ష్మయ్య, జహంగీర్ బాబా, నాయకులు జహంగీర్‌అలీ, యాదగిరిరెడ్డి, రాజేశ్ రాజేందర్ గౌడ్, బిక్షపతి, యాదయ్య,, బుచ్చయ్య, శ్రీకాంత్, ఇమ్రాన్, శ్రీను తదితరులు ఉన్నారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ తహాశీల్దార్‌కి వినతిపత్రం



**ఆమనగల్లు, అక్టోబర్ 17 (అక్షర గళం):** మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆమనగల్లు మండల ఎమ్మా ర్పీఎస్ అధ్యక్షులు కావలి శ్రీశైలం ఆధ్వర్యంలో భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ పై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం పట్టణ కేంద్రంలో తాహా సిల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ ఫహీంకు ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. న్యాయమూర్తిపై దాడి చేసిన దోషులను కఠి నంగా శిక్షించాలని తరాలు మారిన తలరాతలు మారటం లేదన్నారు. ప్రభుత్వాలు మారిన దళితుల మీద దాడులు జరుగు తూనే ఉన్నా యన్నారు. ఇటువంటి దాడులు మళ్లీ పునరు వృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షిం చాలని రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థ గౌరవాన్ని, కాపాడాలని ప్రజాస్వామ్యంపై నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు వస్పుల శ్రీరామ్, సోషల్ మీడియా కన్వీనర్ జంతుక విజయ్ కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కంబాలపల్లి అల్లాజి మాదిగ, ఓగ్గు రాజు మాదిగ, ఓగ్గు మల్లేష్ మాదిగ, కొమ్ము రామస్వామి, కంబాలపల్లి ప్రవీణ్, ఓగ్గు శ్రీశైలం, ఓగ్గు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



## సంఘటితంగా ఉద్యమిద్దాం బంద్ జయప్రదం చేద్దాం

**ఆమనగల్లు, అక్టోబర్ 17 (అక్షర గళం):** 'రిజర్వేషన్ల సాధనకు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలన్నీ ఏకమై సంఘటితంగా ఉద్యమిద్దాం. 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకువద్దాం' అని వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో వివిధ కులాల, వ్యాపారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఈనెల 18న నిర్వహించనున్న బంద్ విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ ప్రక్రియ చేపట్టగా కోర్టు కేసులతో ఆశలపై సందిగ్ధం నెలకొందన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన చివరి దశలో ఉందని, వత్తిడి తెచ్చి సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ కులాల, వ్యాపార సంఘం నాయకులు పాల్గొన్నారు.



## నేడు జరిగే బందుకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి..

**కల్వకుర్తి,అక్టోబర్ 17(అక్షరగళం):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన బందుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపిన నేపథ్యంలో కల్వకుర్తి నియోజకవర్గం లోని ప్రజల తరఫున కాంగ్రెస్ పార్టీ తరఫున బీసీ బందుకు సంపూర్ణ మద్దతు సహకారం అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శు క్రవారం మీడియాకు తెలిపారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

**ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి పత్రం..**

**కల్వకుర్తి,అక్టోబర్ 17(అక్షరగళం):** దేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజే గవాయిపై దాడిని గండిస్తూ ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఆధ్వర్యంలో శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు



మాట్లా డుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరాతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జ్ మద్దిలేటి మాదిగ కల్వకుర్తి మండల ఇంచార్జ్ వర్షపాకుల శేఖర్ మాదిగ కృష్ణ మాదిగ ఏసు మాదిగ ఎర్ర శ్రీను మాదిగ శ్రీను మాదిగ మైనారిటీ నాయకులు హుస్సేన్ పరశు రాములు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ బంద్ విజయవంతం చేయండి..

**బీసీ జేఏసీ బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ..**

**కల్వకుర్తి శాఖ పిలుపు..**

**కల్వకుర్తి, అక్టోబర్ 17 (అక్షర గళం):** బందుకు అన్ని సంస్థలు వ్యాపార వర్గాలు పూర్తిగా సహకరించాలి. బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ తో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బీసీ బందును విజయవంతం చేయాలని బీసీ జేఏసీ బీసీ సబ్బు ప్లాన్ సాధన కమిటీ తాలూకా శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కల్వకుర్తి పట్టణ పరిధిలోని అన్ని కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలలు పాఠశాలలు వస్త్ర వ్యాపార సంస్థలు హోటల్ పెట్రోల్ బంక్స్ సినిమా హాల్స్ వైన్ షాప్స్ మెడికల్ షాపులు తప్ప ఇతర వ్యాపార సంస్థలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా తెలియజేస్తూ విద్యాసంస్థలకు బస్సులు పంపకుండా ఉంచి బందుకు సంఘీభావం ఒకవేళ ఏదైనా విద్యాసంస్థ బందును విఫలయత్నం చేస్తే తరగతులు నిర్వహించినట్లయితే వాటి వల్ల కలిగి వచ్చిన పరిణామాలకు బిసి సబ్ ప్లాన్ సాధన కమిటీ బీసీ సంఘాలకు ఎలాంటి బాధ్యత వహించవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలు జరుగుతున్న బీసీ బందుకు తమ వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి

**వెల్దండ అక్టోబర్ 17 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని గాన్ గట్టు తండా మాజీ సర్పంచ్ పత్య నాయక్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి మాజీ సర్పంచ్ పత్య నాయక్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి వైద్యులను అడిగి తెలుసుకొని వైద్యులకు మెరుగైన వైద్య అందించాలని సూచించారు. పత్యనాయక్‌ను పరామర్శించి వారు కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.



# పాలన గాలికి వదిలి సీఎం, మంత్రుల పర్సనల్ పంచాయతీలు

- కాంట్రాక్టుల కోసం డిపార్టుమెంట్లే రద్దు చేస్తున్నారు
- ఇది మంత్రుల క్యాబినెట్ లెక్క లేదు.. దండుపాళ్యం ముఠా లెక్క ఉంది
- క్యాబినెట్ మీటింగ్ అని చెప్పి.. మంత్రుల పంచాయతీ పెట్టుకున్నరు
- హ్యాం మోడల్ కోసం రుణాలు సేకరించేందుకు టాక్స్ లు పెంచిండు
- ప్రభుత్వం రాగానే హ్యాం మోడల్ పై విచారణ జరిపిస్తం
- ఇంత జరుగుతుంటే బీజేపీ ఎందుకు మౌనంగా ఉంది?
- అసలు ఏం చేసావని విజయోత్సవాలు?
- తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్:** నిన్న క్యాబినెట్ మీటింగ్ పెట్టుకున్నారు. ప్రజలకు సంబంధించిన అంశాల గురించి, ప్రజల సమస్యల గురించి మాట్లాడు తారు అనుకున్నం. దసరాకు మొండి చేయి చూపారు, దీపావళి కానుకగా ప్రజలకు ఏదైనా తీపి వార్త చెబుతారేమో అనుకున్నం. కానీ తీవ్ర నిరాశే మిగిలింది.

రైతులకు బోనస్ పేరిట ఇచ్చే 1300 కోట్ల బకాయిలైనా ఇస్తరేమో అనుకున్నం.. మహిళలకు 2500 ఇచ్చే మహాలక్ష్మి పథకం ప్రారంభిస్తరేమో అనుకున్నం.. పింఛన్లు అయినా పెంచుతరేమో అని అనుకున్నం..కానీ జరిగింది ఏం లేదు, అందరికీ నిరాశే మిగిలింది.. ఏది లేదు.

క్యాబినెట్ మీటింగ్ అని చెప్పి, మంత్రుల పంచాయతీ పెట్టుకున్నరు. క్యాబినెట్ లో ఉన్న మంత్రులు ఒకటి కాదు, రెండు కాదు అరడజను వర్గాలుగా చీలిపోయారు. ఒకరంటే ఒకరికి పడతలేదు.. సీఎం, మంత్రులు పాలన గాలికి వదిలి పర్సనల్ పంచాయతీలు పెట్టుకుంటున్నరు.

కమీషన్ల కోసం ఒకరు, కాంట్రాక్టుల కోసం ఒకరు, వాటాల కోసం ఒకరు, కబ్జాల కోసం, పోస్టింగుల కోసం. ఇది మంత్రుల క్యాబినెట్ లెక్క లేదు.. దండుపాళ్యం ముఠా లెక్క ఉంది. ఇంకా చెప్పాలంటే అంతకంటే అధ్వాన్నం. ప్రతి దాంట్లో కొట్లాటలే.. ఆ మంత్రి ఈ మంత్రిని తిట్టుడు, ఈ మంత్రి ఆ మంత్రి తిట్టుడు ఇదే సరిపోయింది.. అతుకుల బొంతగా ఉన్న ప్రభుత్వంలో ఎప్పుడు ఏం జరుగుతదో అని స్వయంగా మంత్రులే భయపడుతున్నారు..

దీపం ఉండంగనే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతో అధికారంలో ఉన్నపుడే అందినకాడికి దండుకోవాలని చూస్తున్నరు.. కేసీఆర్ ఉద్యోగాల్లో 95శాతం లోకల్ రిజర్వేషన్ సాధించారు. . నీళ్లలో వాటా కోసం కొట్లాడారు. నిధుల వాటా కోసం కొట్లాడారు.. నేడు కమీషన్ల కోసం, కాంట్రాక్టుల కోసం, అక్రమ వసూళ్లలో వాటా కోసం మంత్రులు కొట్లాడుతున్నరు. కాంట్రాక్టుల కోసం డిపార్టుమెంట్లే రద్దు చేస్తున్నారు..

పారిశ్రామిక వేత్తలను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను, సినిమా హీరోలను, కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నరు.. కాంగ్రెస్ తప్పిదాల వల్ల టీఎస్ఐపాస్ వచ్చిన తర్వాత గత ఎనిమిది ఏండ్లలో అతి తక్కువ ఇండస్ట్రీస్, ఇన్వెస్ట్ మెంట్లు రేవంత్ రెడ్డి కాలంలో వచ్చింది. 2024-25లో కేవలం 2049 పరిశ్రమలు, 50వేల కోట్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. . ఎవర్ లోయేస్ట్ ఇన్వెస్ట్మెంట్ టీఎస్ఐపాస్ ఏర్పడ్డ తర్వాత.ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ ఘన కార్యం.

బిఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్ఐపాస్ తెచ్చి , అనుమతులు సులభతరం చేసాం. పెట్టుబడులకు స్వర్గధామంగా రాష్ట్రాన్ని మార్చాం.. పారిశ్రామిక వేత్తలకు రెడ్ కార్పెట్ వేసాం.. కానీ ఇప్పుడు వ్యాపారవేత్తలకు తుపాకులు పెడుతున్నరు.. రేవంత్ రెడ్డి గన్ కల్చర్ తెచ్చిండు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు.. టెక్ మహీంద్ర సీఈఓకు నాడు కేటీఆర్ వర్షంలో గొడుగు పట్టి ఆహ్వానించారు. పెట్టుబడులు రావాలని కృషి చేసింది బిఆర్ఎస్.. ఒక మంత్రి కుమార్తెనే స్పష్టంగా చెబుతున్నారు.. ముఖ్యమంత్రి సన్నిహితులే తుపాకీ పట్టి బెదిరించారు అని.. ముఖ్యమంత్రి జపాన్ నుంచి ఫైల్ ఆపించారు, ఇంకో మంత్రి టెండర్లు మాకు దక్కవద్దని హుకుం జారీ చేసారు అని.. రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతున్నది.. ఇంత జరుగుతుంటే బీజేపీ ఎందుకు మౌనంగా ఉంది?. ముఖ్యమంత్రే తుపాకీ పంపారు అంటే ఎందుకు విచారణ జరపరు?

బీజేపీ, కాంగ్రెస్ జాయింట్ వెంచర్ ప్రభుత్వం కాకుంటే, మీది బడే భాయ్ చోటే బాయ్ సంబంధం లేదు అంటే.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సంజయ్ స్పందించండి.

కేంద్ర ప్రభుత్వ సంస్థలతో విచారణ జరపండి.. లేదా ఇండిపెండెంట్ జ్యుడిషియల్ కమిషన్ పెట్టి నిజానిజాలు బయటకు తీయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే మీ మధ్య అక్రమ సంబంధం ఉన్నట్లే. ..

ఈ పాటి దానికి డిసెంబర్ 1 నుంచి 9 వరకు విజయోత్సవాలు చేస్తరట.. ఎందుకు తుపాకీలు పెట్టి వసూళ్లు చేసామని, మంత్రులు మంత్రులు కొట్టుకుంటున్నందుకా? దేని కోసం విజయోత్సవాలు? 23 నెలల పాలనలో ఏం చేసారు, ఏం సాధించారు? ఒక్క ఇళ్లు కట్టింది లేదు, ఒక్క ఇటుక పేర్చింది లేదు.. ఒక్క చెక్ డ్యాం కట్టింది లేదు, ఒక్క ఎకరాకు నీళ్లు ఇచ్చింది లేదు.. టిమ్స్ ఆసుపత్రులు పూర్తి చేసింది లేదు.

ఉన్న పథకాలను ఊడగొట్టారు. ఫీజు రియింబర్స్ మెంట్ ఇవ్వలేదని జరుపుతారా?

కేసీఆర్ కిట్ బంద్ చేసారని జరుపుతారా? గొర్రెల స్కీం బంద్ పెట్టినమని జరుపుతారా? కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యిలా అద్భుతమైన రాష్ట్రాన్ని మీ చేతిలో పెడితే ఆగం చేశారు. ఆరు గ్యారెంటీలకు దిక్కు లేదు, 420 హామీల అమలు ఊసు లేదు.అయినా విజయోత్సవాలు చేస్తమని చెప్పుకోవడానికి సిగ్గు లేదు..

అసలు ఏం చేసావని విజయోత్సవాలు? రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా?

కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వనందుకా? రైతు కూలీలందరికి ఆత్మీయ భరోసా అని ఇవ్వకుండా మోసం చేసినందుకా? రుణమాఫీ చారణ చేసి బారాణ మందిని మోసం చేసినందుకా? అన్ని పంటలకు బోనస్ అని, సన్నాలకే పరిమితం చేసినందుకా?

1300 కోట్ల బోనస్ డబ్బులు ఇప్పటికీ రైతులకు చెల్లించినందుకా? దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినందుకా? లగ చర్ల, రాజోలి రైతుల చేతుల చేతులకు బీడీలు వేసినందుకా? మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అని యువతను మోసం చేసినందుకా? నిరుద్యోగ భృతి ఎగ్గొడుతున్నందుకా?

మహాలక్ష్మి పేరిట నెలకు 2500 ఇస్తానని, ఇప్పటికీ అమలు చేయనందుకా? ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వనందుకా? అవ్వాతాతలకు పింఛన్లు పెంచనందుకా? హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చినందుకా? మూసీ సుందరీకరణ పేరుతో కమీషన్లు దండుకుంటు న్నందుకా? ఎందుకు విజయోత్సవాలు చేస్తా అంటున్నవు రేవంత్ రెడ్డి? ఇంకెంత కాలం మోసం చేస్తారు, ఇంకెంత కాలం మభ్యపెడుతరు. 22 నెలల కాలంలో అన్ని వర్గాల ప్రజలను అరిగోస పెట్టినవు.

ఎందుకోసం ఉత్సవాలు జరుపుతావు.

కొత్తగా హ్యామ్ మోడల్ అంటున్నారు. ఏంటిది ఇది కమీషన్లు దండుకోవడమే లక్ష్యం. ఇప్పటికే రేవంతు పాలనలో అప్పులు కుప్పగా అయ్యింది రాష్ట్రం. సివిల్ సప్లైలో అప్పులు పేరుకుపోయినవి. ట్రాన్స్ కో డిస్కంలు అప్పుల కుప్పలుగా మార్చారు.. ఎఫ్ఆర్బీఎం అప్పులు గత పదేళ్లలో ఎన్నడూ తేనంత అప్పులు తెచ్చారు.

కాంట్రాక్టర్లకు లబ్ది కోసం, కమీషన్లు దండుకునేందుకు హ్యాం మోడళు పిలిచారు. 10,547 కోట్లతో టెండర్లు పిలిచి, బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి కమీషన్లు దండుకునే ప్రయత్నం. మా పాలనలో రోడ్లు వేయలేదా? బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నపుడు ప్రతి గ్రామానికి రోడ్డు వేసింది. ప్రతి మండల కేంద్రంకు, జిల్లా హెడ్ క్వార్టర్లకు రోడ్లు వేసింది.

హ్యాం పేరిట రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేస్తున్నారు. బ్యాంకుల్లో అప్పులు పుట్టకపోతే జీవో 53, 54 లతో కొత్త వాహనాలపై లైఫ్ ట్యాక్స్ పెంచి ప్రజలపై భారం వేసిండు. పేద, మధ్య తరగతి ప్రజలను దొంగ దెబ్బ కొట్టిండు రేవంత్ రెడ్డి. లైఫ్ టైం టాక్సులు, రిజిస్ట్రేషన్ చార్జీలు అడ్డ గోలుగా పెంచిప్రజల రక్తం పీల్చుతున్నడు రేవంత్ రెడ్డి. ఎందుకు ఇదంతా అంటే.. ఈ డబ్బులతో బ్యాంకులకు పైసలు కడుతం అని నమ్మిస్తున్నరు.

హ్యాం మోడల్ కోసం రుణాలు సేకరించేందుకు టాక్స్ లు పెంచిండు. టోల్ ద్వారా వసూలు చేయబోమని చెబుతూ మరోవైపు దొంగదారిలో ఈ పన్నులు పెంచిండు. హ్యాం మోడల్ అనేది ఒక బోగస్. దాని పేరు చెప్పి కమీషన్లు దండుకోవడమే తప్ప ప్రభుత్వం చేస్తున్నదేం లేదు. బిఆర్ఎస్ ప్రభుత్వం రాగానే హ్యాం మోడల్ పై విచారణ జరిపిస్తం, దోచుకున్న ప్రతి ఒక్కరిపై రికవరీ పెడుతం.

ఈరోజు రాష్ట్రంలో అందరూ బాధపడుతున్నారు. దిగ్విజయంగా దూసుకుపోతున్న రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేసింది. ప్రజల సమస్యలు వదిలి మంత్రులే దంచుకుంటున్నారు. మంత్రులు గొడవలు పెట్టుకుంటుంటే సీఎం చోద్యం చూస్తున్నడు. పాలన గాడి తప్పింది. అరాచకత్వం పెరిగింది. క్యాబినెట్ మంత్రి కుటుంబ సభ్యులు తుపాకీ ముఖ్యమంత్రి ఇచ్చిండు అని చెబుతున్నారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాం

దీనిపై లీగల్‌గా ముందుకు వెళ్తాం. ఏ ఏజెన్సీలకు సంస్థలకు ఫిర్యాదు చేయాలన్న దానిపై ఆలోచిస్తున్నాం.పెట్టుబడిదారులు, వ్యాపారస్తులు, సినిమాపెద్దలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అందరికి విజ్ఞప్తి చేస్తున్నాం. మీరు భయపడవద్దు. మీకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఉంటుంది.

## తెలంగాణ మెడికల్ డివైసెస్ పార్క్... కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైసెస్ పార్క్‌లో హ్యూవెల్ సంస్థ ఏర్పాటు చేసిన నూతన కెమిస్ట్రీ ల్యాబ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాంత బయోటెక్ ఎండీ వరప్రసాద్ రెడ్డి, హ్యూవెల్ కంపెనీ ఎండీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ మెడికల్ డివైసెస్ పార్క్ ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించారు. "మన దేశంలో 70, 8 నుంచి 80% మనం వాడే మెడికల్ పరికరాలన్నీ కూడా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అట్లా ఎందుకు ఉండాలి? మన దేశంలో ఎందుకు ఈ ఉత్పత్తులు కాకూడదు?" అనే ఆలోచనతో కేసీఆర్ ప్రభుత్వంలో ఈ మెడికల్ డివైసెస్ పార్క్ ఏర్పాటు చేశారు. మన దేశంలో ఉత్పత్తి అయితే ధర కూడా తగ్గి, సామాన్యుడికి ఇవన్నీ అందుబాటులోకి వస్తాయన్న ఉద్దేశంతోనే దీనిని ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు.

పార్క్ ఏర్పాటుకు ముందు సుల్తాన్‌పూర్ ఏరియాలో స్టోన్ క్రషర్లు, మెటల్ క్రషర్లు, కొంత ఖాళీ జాగా తప్ప ఏమీ లేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఇక్కడికి వస్తే వేల మంది పని చేస్తుండటం, అనేక పరిశ్రమలు రావడం చూసి చాలా సంతోషం అనిపించిందని అన్నారు. ఇక్కడ జరిగిన పరిశోధనలు, ప్రవేశపెట్టిన ఉత్పత్తులు చూస్తే తనకు విశ్వాసం కలిగిందని తెలిపారు.

**కోవిడ్ సమయంలో హ్యూవెల్ కృషికి కేటీఆర్ ప్రశంస**

కోవిడ్ సమయంలో ఆర్టీపీసీఆర్ టెస్ట్‌లకు, కోవిడ్ కిట్స్‌కు విపరీతమైన గిరాకీ, డిమాండ్ ఉండేదని, ఆ రోజుల్లో టెస్ట్ కిట్ కావాలంటే చాలా పెద్ద ఎత్తున ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉండేదని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ, హ్యూవెల్ సంస్థకు చెందిన శిశిర్, రచన, వారి బృందం మొత్తం కలిసి అప్పట్లో ?6,000 ఖర్చయ్యే ఒక టెస్ట్ ధరను కేవలం ?12కు తగ్గించామని చెప్పడం అద్భుతమని కొనియాడారు. పోర్టబుల్ ఆర్టీపీసీఆర్ కిట్ వంటి ఉత్పత్తుల ద్వారా ధరలు తగ్గించి సామాన్యుడికి మేలు చేసే పరిశోధనలు,




కార్యక్రమాలు చేస్తున్నందుకు కేటీఆర్ హ్యూవెల్ బృందాన్ని అభినందించారు.

**సామాన్య ప్రజల కోసం టెక్నాలజీ ఉండాలి**

"సామాన్యుడికి ఫలాలు అందించని పరిశోధన నిష్ఫలం, దాని వల్ల వ్యర్థం," అని కేసీఆర్ తమకు ఎప్పుడూ చెప్తుంటారని కేటీఆర్ తెలిపారు. సాంకేతికత(టెక్నాలజీ) ఉన్నా దాని వల్ల సామాన్యుడికి లాభం జరగకపోతే అది వేస్ట్ అని కేసీఆర్ సందేశాన్ని ఆయన పునరుద్ఘాటించారు. హ్యూవెల్ సంస్థకు ఇది పదో వార్షికోత్సవం సందర్భంగా కేటీఆర్ బృందాన్ని అభినందించారు. "మీరు కూడా మేం కూడా కలిసి హైదరాబాద్‌ని, తెలంగాణాని, భారతదేశాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మనసారా కోరుకుంటున్నాను," అని కేటీఆర్ ఆకాంక్షించారు. "మరో రెండేళ్లలో మేంఅధికారంలోకి వస్తాం. వచ్చిన తర్వాత ఇంకా బాగా చేస్తాం," అని ఆయన అన్నారు.

# కత్తులు కటార్లతో ప్రదర్శనలు ఏమిటి?

**- అంతరాష్ట్ర రౌడీల ప్రదర్శనలా కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమం**

**- నామినేషన్ కార్యక్రమం లో రౌడీలు కత్తులు కటార్లతో వీరంగం**


**- రౌడీ కావాలా? సౌమ్యురాలైన బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలవాలా?**

**- బీహార్లో పోటీ చేస్తున్న ఎంఐఎం జూబ్లీహిల్స్‌లో ఎందుకు పోటీ చేయడం లేదు?**

**- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కె .సంజయ్**

**హైదరాబాద్:** జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమం జరిగింది. అంతరాష్ట్ర రౌడీల ప్రదర్శనలా కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ కార్య క్రమం జరిగింది. నామినేషన్ కార్యక్రమంలో రౌడీలు కత్తులు కటార్లతో వీరంగం చేశారు నామినేషన్ కార్యక్రమం రౌడీలతో నిండిపోతే పోలీసులు చోద్యం చూశారు. నేర చరితులను ఒకే చోట చేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది. ఇపుడే ఇలా ఉంటే రేపు నవీన్ యాదవ్ గెలిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో జూబ్లీ హిల్స్ ప్రజలు ఆలోచించుకోవాలి. రౌడీ కావాలా? సౌమ్యురాలైన బీ ఆర్ ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలవాలా? జూబ్లీ హిల్స్ ప్రజలు ఆలోచించుకోవాలి. రౌడీ కల్చర్ పోవాలంటే బీ ఆర్ ఎస్ గెలవాలి. కాంగ్రెస్ అభ్యర్థికి ఒవైసి మద్దతు ప్రకటించి పదేళ్ల బీ ఆర్ ఎస్ పాలన ను తప్పు పడుతున్నారు. అజారుద్దీన్ ను ఓడించేందుకు ఎం ఐ ఎం తన అభ్యర్థిని గతంలో దించింది. .ఇపుడు ఎందుకు అభ్యర్థిని దింపలేదు? బీహార్లో పోటీ చేస్తున్న ఎం ఐ ఎం జూబ్లీ హిల్స్ లో ఎందుకు పోటీ చేయడం లేదు? ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.

కేసీఆర్ హయం లోనే జూబ్లీ హిల్స్ అభివృద్ధి జరిగింది. ఒవైసికి



ఆ అభివృద్ధి కనిపించక పోతే మేము ఏం చేస్తాం ? బీజేపీ బీ ఆర్ ఎస్‌ల సిద్ధాంతాలు వేర్వేరు?ఎలా కలుస్తాయి? దొంగ ఓట్లతో గెలవాలని కాంగ్రెస్ చేసే యత్నాలు అడ్డుకుంటాం. కాంగ్రెస్ రౌడీయిజంకు ఓట్లు పడవు

జూబ్లీ హిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కత్తులు కటార్లతో ప్రదర్శనలు ఏమిటి ? ప్రచారానికి వెళ్తున్న మా కార్యకర్తలను నవీన్ మనుషులు బెదిరిస్తున్నారు. ఎన్నికల కమిషన్, పోలీసుల తీరు మారాలి. సీఎం గన్ కల్చర్ ను ప్రోత్సహిస్తుంటే, కాంగ్రెస్ అభ్యర్థి కత్తులతో వీరంగం చేయరా ? అధికారం ఉంది కదా ఏమి చేసినా చెల్లుతుందంటే కుదరదు.. సినిమా లో విలన్ల ను చూసాం .ఈ రోజు మళ్ళీ నామినేషన్ల ఘట్టంలో మళ్ళీ వాళ్ళను చూసాం. ట్రాఫిక్‌కు గంటల తరబడి అంతరాయం కలిగినా పోలీసులు పట్టించుకోలేదు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. బీఆర్ఎస్ కచ్చితంగా జూబ్లీ హిల్స్‌లో గెలుస్తుంది. ప్రెస్ మీట్ లో మాజీ ఎమ్మెల్యే ఎన్ .భాస్కర్ రావు , బీ ఆర్ ఎస్ నేతలు ప్రశాంత్ కుమార్ రెడ్డి , తోట ఆగయ్య పాల్గొన్నారు

# సంపాదకీయం..

## కాంగ్రెస్ ముసుగు తొలగుతోంది.!

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. త్వరలోనే అంటే డిసెంబర్‌లో రెండేళ్ల వార్షికోత్సవాలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో పార్టీలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ప్రభుత్వంలో,పార్టీలో ఎవరికి వారే యమునాతీరే అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అసలురంగు మెల్లగా బయలకు వస్తోంది. అధికారంలో ఉంటే అవినీతి అన్నది దానిచుట్టూ పెనవేసు కుంటుంది. మంత్రుల అవినీతిపై ఊరూవాడా గుసగుసలు ఎక్కువయ్యాయి. బిఆర్ఎస్ అవినీతి గురించి తిట్టిపోస్తున్నా... రెండేళ్ల కాలంలో ఒక్కటీ రుజువు చేయలేదు. ఒక్కరిపైనా చర్య తీసుకోలేదు. ప్రచారం కోసం మాత్రం అవినీతిని వాడుకుంటున్నారు.



ఇకపోతే సిఎం రేవంత్ రెడ్డి కూడా తనమానాన తన పనులు చేసుకుంటూ పోతున్నట్లుగా ఉంది. ఇటీవల



మంత్రుల మధ్య కులపంచాయితీ మొదల య్యింది. పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ కుమార్ మధ్య పంచాయితీ సద్దుమణిగిందని అనిపించారు. అడ్లూరి, వివేక మధ్యన కూడా గొడవలు ఉన్నాయి. మంత్రుల్లో ఒకరంటే ఒకరికి గిట్టడం లేదు. ఇకపోతే బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన తరవాత జివో ఇవ్వడం, హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో కేసుల వేయడం ద్వారా కాంగ్రెస్ అపరిపక్వ విధానాలు తేటతెల్లం అయ్యాయి. ఓ రకంగా పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తూ ముందుకు సాగివుంటే ఇంత పంచాయితీ వచ్చేది కాదు. ఈ విషయంలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేశారు. దీనిపై ఎంతధనం వెచ్చించారో ప్రజలకు చెప్పాలి. హైకోర్టు, సుప్రీంకోర్టు, లాయర్లు, మంత్రుల ఢిల్లీ పర్యటనల ఖర్చులు తెలియచేసి నిజాయితీ చూపాలి. ఇకపోతే ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అనర్హులకు కేటాయించారంటూ పలు జిల్లాల్లో ప్రజలు రోడ్డెక్కి నిలదీస్తున్నారు. కిలో రూపాయికి సన్న బియ్యం దాదాపు అందరికీ ముడుతున్నాయి. అందువల్ల పంచాయితీ రావడం లేదు. దుబారాను ఎలాగూ పట్టించుకోరన్నది తేలింది. ఇకపోతే మంత్రులపై వస్తున్న అవినీతిపైనా చర్చించాలి. కానీ చెప్పడం లేదు. ఇచ్చిన హామీలంటూ అనేకం అమలు చేయలేదు. కనీసం గ్రామస్థాయిలో ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్న బాధ్యతను కూడా ప్రభుత్వం ప్రదర్శించడం లేదు. వర్షాలకు రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఎక్కడా తట్టెడు మన్ను పోయడం లేదు. ఉద్యోగుల్లో అవినీతి పెరిగింది. డబ్బులు లేనిదే ఫైలు కదలడం లేదు. ఎసిబి నామమాత్రపు దాడులను ఉద్యోగులు లెక్కచేయడం లేదు. ఇక కొత్తగా కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు నడుస్తోంది.ఆమె అవినీతిలో కూరుకుపోతున్న వైనం బాహాటంగా వినవస్తోంది. ఇటీవల జరుగుతున్న వరుస పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తున్నది. దీనికితోడు సిఎం, మంత్రులు తనపై కక్షకట్టారని కొండా దంపతులు, కుటుంబం కూడా ఆరోపిస్తోంది.తాజాగా కేబినేట్‌కు డుమ్మా కొట్టారు. మొన్నటికి మొన్న మేడారం సమీక్షకు కూడా దూరంగా ఉన్నారు. రేవంత్‌రెడ్డి బుధవారం పరామర్శ పేరుతో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులందరూ హాజరైనా మంత్రి కొండా సురేఖ మాత్రం ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనుల్లో ఆమె ప్రమేయం లేకుండా ఇన్‌చార్జి మంత్రి పేరుతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తుండటం మంత్రి సురేఖకు ఆగ్రహం తెప్పించిందని అంటున్నారు. దీనికి తోడు మేడారం టెండర్ల లీకు వ్యవహారంలో సురేఖ ఓఎస్డీ సుమంత్ పాత్ర ఉన్నదనే అనుమానంతో ప్రభుత్వం ఆయనను ఆ పోస్టు నుంచి తొలగించింది. సుమంత్ కొండా సురేఖ నివాసంలోనే ఉన్నారన్న సమాచారంతో బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంత్రి ఇంటికి వెళ్లారు. ఈ పరిణామాలన్నింటి వెనుక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారని కొండా సురేఖ కుమార్తె సుస్మితాపటేల్ ఆరోపించారు. ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబంపై సురేఖ చేసిన వ్యాఖ్యల నుంచి ఆమె ఓఎస్డీ తొలగింపు వరకు చోటుచేసుకుంటున్న పరిణామాలు సంచలనంగా మారాయి. అయితే, ప్రతి ఘటనను తనకు అనుకూలంగా మలచుకున్న కొండా సురేఖ ఈసారి మాత్రం తమను 'రెడ్డి' సామాజికవర్గం టార్గెట్ చేసిందని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి ముసలం పుట్టిందా అన్ని చర్చ సాగుతోంది. ఇన్నాళ్లూ గుట్టుగా సాగిన అవినీతి బయట ప్రజల్లో చర్చకు దారితీస్తోంది. మంత్రుల మధ్య వివాదాలు, కొండా సురేఖ వర్సెస్ పొంగులేటి, మేడారం టెండర్లు.. ఇలా కొన్నిరోజులుగా బయటికి వచ్చినవన్నీ కొన్ని మాత్రమే. కానీ, తెరవెనక అవినీతి అనకొండలు ఉన్నట్టు మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్ వ్యవహారంతో బయటపడింది. మేడారం టెండర్ల నేపథ్యంలో మంత్రుల మధ్య విబేధాలు బయటపడినట్టు కనిపిస్తున్నా..ఈ వ్యవహారం కొండా సురేఖ చుట్టే తిరిగిందని ప్రచారం జరుగుతున్నది. సూర్యాపేట జిల్లాలోని సున్నపురాయి గనులను నిబంధనలకు విరుద్ధంగా రెండు సిమెంటు కంపెనీలకు కట్టబెట్టడంతో వచ్చిన ముడుపుల వ్యవహారమని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇకపోతే దక్కన్ సిమెంట్ కంపెనీపై అక్రమ మైనింగ్ వ్యవహారంలో భారీ జరిమానా పడినట్టు సమాచారం. మైనింగ్‌లో గనులతో పాటు అటవీ శాఖకు కూడా సంబంధం ఉంటుంది. కంపెనీల వ్యవహారంపై కొంతకాలం కిందట మంత్రి కొండాకు ఉప్పందడంతో ప్రత్యేక దృష్టిపెట్టినట్టు తెలుస్తున్నది. ఈక్రమంలోనే సుమంత్ రంగంలోకి దిగి కంపెనీతో డీల్‌కు ప్రయత్నించాడనే ఆరోపణలున్నాయి. ఈ పరిణామాల వల్లే మేడారం పనుల్లో సురేఖను దూరం పెట్టడం, ఓఎస్డీని తొలగించి మంగళవారం రాత్రి కొండా నివాసానికి పోలీసులను ఉసిగొల్పినట్టు స్పష్టమవుతున్నది. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం ఒక్కటే కనిపిస్తున్నా అనేక విధాలుగా అవినీతి గుప్పుమంటోంది. కెసిఆర్‌ను తిట్టిపోస్తూ ...వీరు కూడా అలాగే తయారయ్యారన్న ప్రచారం సాగుతోంది. పనులకు, బిల్లులకు పర్సెంటీజుల లేనిదే రావడం లేదంటున్నారు. కాంగ్రెస్ అవినీతి ఎప్పటికైనా బద్దలు కాక తప్పదని బిఆర్ఎస్ ధీమాగా ఉంది. తమ అవినీతి వ్యవహారం ఇక బయటకు రాదన్న భరోసా కూడా ఉంది.

## అఫ్గాన్, భారత్‌లతో ఏకకాలంలో యుద్ధం చేస్తాం

ఆపరేషన్ సిందూర్‌లో చావుదెబ్బతిన్నా పాక్ బుద్ధి మారడం లేదు. ప్రేలాపనలు ఆగడగం లేదు. అఫ్గాన్‌తో సరిహద్దె సమస్య, భారత్‌కు అఫ్గాన్ చేరువ కావడాన్ని పాక్ జీర్ణించుకోవడం లేదు. అవసరమైతే ఈ రెండు దేశాలతో ఏకకాలంలో యుద్ధం చేస్తామని మరోమారు పాక్ రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ మాటలు తూలారు. ఈ రకంగా భారత్‌పై పాకిస్థాన్ మరోసారి పిచ్చి ప్రేలాపనకు దిగింది. అఫ్గానిస్థాన్ మనకు దగ్గరవడం జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతోంది. సరిహద్దు వెంట భారత్ డర్టీ గేమ్స్ ఆడేందుకు అవకాశాలున్నాయని దాయాది రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ నోటికొచ్చినట్లు వ్యాఖ్యలు చేశారు. తాలిబన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు నెలకొన్న వేళ..ఖ్వాజా ఆసిఫ్ ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్‌తో కూడా సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్రమైతే ఎలా? అని మంత్రికి ప్రశ్న ఎదురుకాగా...అవును.. దానిని కొట్టిపారేయలేం. ద్విముఖ యుద్ధానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉంది. అందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి. వాటి గురించి నేను చర్చించను అని చెప్పనంటూ భారత్ గురించి నోరుపారేసుకున్నారు. అలాగే తమ దేశంలో నివసిస్తోన్న అఫ్గాన్ శరణార్థులను లక్ష్యంగా చేసుకున్నారు. వారివల్ల పాక్‌కు ఎలాంటి ఉపయోగం లేకపోగా.. వారు ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారు. పాక్‌లో అక్రమంగా నివసిస్తోన్న వారిని గుర్తిస్తున్నాం. వారు వెంటనే మా దేశాన్ని వీడాలని వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఇరుదేశాల బలగాలు పలుచోట్ల పరస్పరం దాడులకు దిగిన సంగతి తెలిసిందే. దాంతో ఇరువైపులా ప్రాణనష్టం సంభవించింది. పాక్ పై దాడులు ప్రారంభమైనపుడు అఫ్గాన్ విదేశాంగ మంత్రి దిల్లీలోనే ఉన్నారని, భారత ఆదేశాల మేరకే తమపై దాడులు జరిగాయని పాక్ ఆరోపిస్తోంది. భారత్ తరఫున అఫ్గానిస్థాన్ తమపై పరోక్షయుద్ధం చేస్తోందని పాకిస్థాన్ రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఆరోపణలు చేశారు. వీటికి భారత్ ప్రభుత్వం గట్టిగా కౌంటర్ ఇచ్చింది. పాక్ ఉగ్రవాద సంస్థలకు ఆతిథ్యమిచ్చి వారి కార్యకలాపాలను ప్రోత్సహిస్తోంది. తన అంతర్గత వైఫల్యాలకు పొరుగువారిని నిందించటం ఆ దేశానికున్న అలవాటు. అఫ్గానిస్థాన్ తన సొంత భూభాగాలపై సార్వభౌమత్వాన్ని చెలాయించడం పాక్‌కు కోపం తెప్పిస్తోందని భారత విదేశాంగశాఖ మండిపడింది.

# కీలెరిగి వాత పెడుతున్న చైనా!

కీలెరిగి వాత పెట్టాలని పెద్దలు చెప్పారు. దీని వర్తమాన అర్థం శరీరంలోని కీళ్లు కాదు. మనల్ని దెబ్బతీసేందుకు చూసే ఎదుటివారిని ఎక్కడ దెబ్బతీయాలో తెలుసుకుని ఆపని చేయటం. ఇప్పుడు చైనా అదే చేస్తోంది. తమను దెబ్బతీయాలని ప్రపంచంలోని అనేక శక్తులను కూడగట్టేందుకు అమెరికా వేస్తున్న ఎత్తులు, చేస్తున్న జిత్తులను చూసిన తర్వాత దాని కీళ్లెరిగి వాత పెట్టటంతో ట్రంప్ అల్లాడిపోతున్నాడు. దిక్కుతోచక ఏం మాట్లాడుతున్నాడో తెలియటం లేదు. నరేంద్రమోడీ తననెంతో ప్రేమిస్తారని అయితే అతని రాజకీయ జీవితాన్ని నాశనం చేయదలుచుకోలేదని తాజాగా ట్రంప్ వ్యాఖ్యానించాడు. అమెరికా విత్తమంత్రి స్కాట్ బెసెంట్ తాజాగా చైనాను ఎదుర్కోవాలంటే తమతో భారత్, ఐరోపా దేశాలు చేతులు కల పాలని ఒక టీవీలో చెప్పాడు. ఈ పెద్దమనిషి కొద్ది నెలలక్రితం మన దేశంపై ఒత్తిడి పెంచి వాణిజ్య రాయితీలు రాబట్టుకోవటం తమ ఎత్తుగడ అన్నాడు.

మన దేశాన్ని పన్నుల రారాజు అని వర్ణించాడు. మన రూపాయి పతనాన్ని అపహాస్యం చేశాడు. మన ఎగుమతులపై సుంకాలు, రష్యా చమురు కొనుగోలుపై అపరాధ సుంకాలు విధించాలన్న నోటితో మూడు నెలల్లో ఇన్ని పిల్లిమొగ్గలు వేయటం వెనుక అమెరికాకు చెప్పుకోలేని చోట తగిలిన దెబ్బే కారణంగా చెప్పవచ్చు. బెసెంట్ మాట్లాడిన సమయం లోనే ట్రంప్ మరోబాంబు పేల్చా డు. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేస్తానని మోడీ హామీ ఇచ్చినట్లు బహిరంగంగా ప్రకటించాడు. దీంతో ఏం చెప్పాలో దిక్కుతోచని కేంద్ర ప్రభుత్వం విదేశాంగశాఖ ప్రతినిధి ద్వారా స్థిరమైన ధరలు, భద్రమైన సరఫరా అనే రెండు లక్ష్యాలతో ఇంథన విధానం ఉంటుందని చెప్పించారు తప్ప అవునని కాదనీ, అసలు మోడీ అలాంటి హామీ ఇచ్చారా లేదా అన్నది చెప్పలేదు.

విలువైన లేదా అపురూప ఖనిజాలు. వాటి ఉత్పత్తులు నేడు ఏంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వాటి ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్న చైనా ప్రభుత్వ అనుమతించిన మేరకే ఏ దేశానికైనా పంపాలని తన కంపెనీలను ఆదేశించింది. ఇది అన్ని దేశాలకూ వర్తించేదే. చైనా అందరికీ ముప్పు తలపెట్టిందని, అందరం కలసి చైనా మీద కత్తిగట్టాలని భారత్ కలసి రావాలని బెసెంట్ కుటిల నీతిని ప్రదర్శించాడు. చైనా ఈనెల 9న ఆంక్షలు ఎందుకు విధించింది ? బీజింగ్ నిర్ణయం వెనుక అన్నింటికీ సన్నద్ధత ఉందని వేరే చెప్పనవసరం లేదు. ఇప్పటికిప్పుడు



అపురూప ఖనిజాల ఉత్పత్తుల విషయంలో మరోదేశం దాన్ని అధిగమించే స్థితిలో లేదు. అదే చైనా బలం. తాడిని తన్నేవాడుంటే వాడి తలదన్నే వాడుంటాడు అన్నట్లుగా ఇంతకాలం తిరుగులేని అమెరికా తన షరతులతో ప్రపంచాన్ని శాసిస్తున్నది. ఇప్పుడు కొన్ని అంశాల్లో నా మాటే శాసనం అన్న శివగామిలా చైనా తయారైంది.

ఈ సమస్యను ఇచ్చిపుచ్చుకొనే పద్ధతిలో పరిష్కరించుకోవాలి తప్ప బెదిరింపులకు దిగితే చెల్లేరోజులు కావివి, ఇది చైనాతో సహా అన్ని దేశాలకూ వర్తిస్తుంది. చైనా చర్యకు ప్రతిగా దాని వస్తువుల మీద నవంబరు ఒకటి నుంచి వందశాతం పన్ను విధిస్తానని ట్రంప్ చెప్పాడు, ఇంత జరిగాక దక్షిణ కొరియాలో జరిగే అపెక్ సమావేశాల్లో షీ జిన్‌పింగ్‌ను కలవాల్సిన అవసరం ఏముందన్నట్లుగా వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. అమెరికా జియలాజికల్ సర్వే నివేదిక ప్రకారం ఈ అపురూప ఖనిజాలు, వాటి ఉత్పత్తులు లేకపోతే విద్యుత్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్‌తో పాటు కృత్రిమ మేధ చిప్స్, రక్షణ సాంకేతిక పరిజ్ఞానం, పునరుత్పాదక ఇంథన వ్యవస్థలు పనిచేయవు. అమెరికా అసలు సమస్య ఇదే. ఎఫ్-35 ఆధునిక యుద్ధ విమానాలను అది తయారు చేయగలదు గానీ చైనా నుంచి వచ్చే ఈ ఖనిజాల ఉత్పత్తుల్లేకుండా అవి ఎగరవు.

ప్రపంచంలోని ఈ ఖనిజాల నిల్వల్లో చైనా 36, వియత్నాం 22, బ్రెజిల్ 18శాతం కలిగిఉండగా అమెరికాలో కేవలం రెండుశాతమే ఉన్నాయి. తరువాతేం జరుగుతుందో తెలియదు గానీ ఈ ఖనిజాలతో తయారయ్యే ఉత్పత్తులు ప్రస్తుతం 70శాతం చైనాలోనే జరుగుతున్నాయి. ప్రపంచ ఉత్పాదక సామర్థ్యంలో 90శాతం వాటా కలిగి ఉంది. అమెరికా తన అవసరాల్లో 70శాతం చైనా నుంచి తీర్చుకుంటున్నది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలన్నా ఐదు నుంచి పదేండ్లు పడుతుందని అంచనా. అంతకాలం అమెరికా కార్పొరేట్లు వేచి ఉండే అవకాశం లేదు. అందుకే అవి చైనాతో రాజీకి రావాలని ట్రంప్ మీద ఒత్తిడి కూడా తెస్తున్నాయి.వివేచనతో వింటాడా, మొండిగా ముందుకు పోయి ముక్కు పగలగొట్టుకుంటాడా? అన్నది చూడాల్సి ఉంది. ఎవరి ప్రయోజనాలు వారివి!

# కులం కింద నలిగిన చట్టం

సమాజం వైజ్ఞానికంగా, ఆధునికంగా ముందుకు సాగుతున్నా కులం అనే మలినగోడ మాత్రం ఇంకా అడ్డుపడుతూనే ఉంది. భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై మతోన్మాది బూటు విసిరిన ఘటనపై దేశంలో చర్చ నడుస్తుండగానే మరో వార్త మానవహృదయాల్ని కదిలించింది. హర్యానాలో ఐపిఎస్ అధికారి వై. పురాణ్‌కుమార్ ఆత్మహత్య పోలీసు వ్యవస్థలో దాగి ఉన్న కులాధిపత్యాన్ని బహిర్గత పరిచింది. ఒక పోలీస్ అధికారి తన ఫిర్యాదును, ఆవేదనను చట్టం ముందు పెట్టలేక తనువు చాలించడం నిజంగా దౌర్భగ్యం. ఆయన రాసిన తొమ్మిది పేజీల సూసైడ్‌నోట్ కేవలం వ్యక్తిగత బాధకాదు, కులం ఆధారిత వివక్ష, అధికారిక దౌర్జన్యం, మానసిక వేధింపులతో అల్లాడిన ఆత్మఘోష. అందరూ సమానమేనని రాజ్యాంగం చెబుతుంటే, కులం ముందు ఎవ్వరూ సమానం కాదని కుల వ్యవస్థ చాటుతోంది. ఒక ఐపీఎస్ అధికారి కూడా కులం బారినపడి ప్రాణాలు తీసుకోవాల్సి వస్తే ఇక సాధారణ పౌరునికి న్యాయం ఎక్కడన్నదే ప్రశ్న. మంగళవారం జరిగిన ఈ దారుణం వెనుక వాస్తవాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడం పోలీస్‌శాఖలోని దుర్మార్గాన్ని ఎత్తిచూపు తున్నాయి. ఇది వ్యక్తి మరణం కాదు, సామాజిక వివక్షతల హత్య.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పురాణ్‌కుమార్ 2001కి చెందిన ఐపీఎస్ అధికారి. ఛండీగఢ్‌లోని తన నివాసంలో ఈ నెల 7న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయాడు. మొదట ఈ ఆత్మహత్యను వ్యక్తిగతంగానే అందరూ భావించినప్పటికీ సూసైడ్‌నోట్ దొరికిన తర్వాతే అసలు విషయం బయపడింది. తనను తక్కువ చేసిన వ్యవస్థ గురించి, కులం కారణంగా ఎదుర్కొన్న అవమానాలతో ఆయనపడ్డ 'మరణ'వేదన అంతాఇంతా కాదు. సూసైడ్‌నోట్‌లో డీజీపీ శత్రుజీత్‌సింగ్ కపూర్, రోతక్ పోలీస్ అధికారి నరేంద్ర బిజర్నియా, మరో అధికారి పేర్లు ఉన్నా వాటిని పోలీసులు బయటకు వెల్లడించలేదు. అయితే పురాణ్ పేరుతో అతని వ్యక్తిగత సహాయకుడు లంచం తీసుకున్నాడన్న ఓ మద్యం కాంట్రాక్టర్ ఫిర్యాదుతో పురాణ్ పేరును ఉన్నతాధికారులు ఎఫ్ఐఆర్‌లో చేర్చడంతో ఆయన తీవ్రంగా కలత చెందినట్టు లేఖ ద్వారా స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఐపీఎస్ అధికారి పేరును చేర్చడం అధికారుల కక్ష సాధింపును



తెలియజేస్తోంది. డిపార్ట్‌మెంట్‌లో కులవివక్ష ఎక్కువైందని, గత కొన్నేండ్లుగా మానసికంగా వేధిస్తున్నారని కూడా నోట్‌లో ఉంది. అణగారిన కులాలకు చెందినవారు పైకి ఎదగడాన్ని పెత్తందారి తనం ఒప్పుకోదు, సహించదు కదా..! అందుకే ప్రాధాన్యతలేని పోస్టుకు అతన్ని ట్రాన్స్‌ఫర్ చేశారని వస్తున్న ఆరోపణలు ఎంతమాత్రం సత్యదూరం కాదు.

2008లోనూ ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి వేధింపులపై పురాణ్ జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. దీన్నిబట్టి కులం వేర్లు అతన్ని ఏ విధంగా వెంబడించాయో అర్థం చేసుకోవచ్చు. పైగా అక్కడ జరిగే అవినీతి అక్రమాలపై పురాణ్ ఉన్నతాధికారులను ప్రశ్నించేవాడని, అందుకే అతన్ని టార్గెట్ చేశారని జరుగుతున్న చర్చను అంత తేలిగ్గాకొట్టిపారేయలేం. భార్య అమనీత్‌కుమార్ కూడా ఓ ఐఏఎస్ అధికారిణి. తన భర్త మరణం సహజమైనది కాదని, కుల అవమానాలు, ఆధిపత్య వేధింపులే అతన్ని బలితీసుకున్నాయని విలపించిన తీరు దేశాన్ని కదిలించింది. 'ఇద్దరు అధికారులు తన భర్తను ఏండ్లకొద్దీ టార్చర్ చేశారు. వారిని శిక్షించాలి' అని వేడుకోవడం పోలీస్ వ్యవస్థలో మితిమీరిన వేధింపులకు అద్దం పడుతోంది. కులం ముప్పు నుంచి సాధారణ ప్రజలకే కాదు, న్యాయమూర్తులకు, పోలీసు అధికారులకూ మినహాయింపులు లేదనడానికి ఇంతకన్నా రుజువు ఏం కావాలి?

సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై దాడి, ఐపీఎస్ అధికారి పురాణ్‌కుమార్ ఆత్మహత్య, ఘటనలు వేరు కావచ్చు కానీ, ఈ రెండింట్లో దాగి ఉన్న మూలం మాత్రం కులం. నేడు హిందూత్వ రాజకీయాలు 'సనాతన' ధర్మం అగ్రకుల దురహంకారానికి ఆజ్యం పోస్తూ..దళితులను అవమానిస్తూ వారిపై ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. "సామాజిక సమానత్వం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం ఒక చిత్తు కాగితమే" అన్నారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్. ఈ మాటలు ఇప్పుడు ఢిల్లీ అత్యున్నత న్యాయస్థానంలో, హర్యానా పోలీస్‌స్టేషన్ గోడలపై ప్రతిధ్వనిస్తున్నాయి. బీజేపీ పాలనలో కులం బలపడిన తీరును ఇవి ప్రతిబింబిస్తున్నాయి. పురాణ్ సూసైడ్ నోట్ ఆధారంగా చివరికి డీజీపీపై కేసు నమోదు చేశారు. కానీ విచారణ న్యాయంగా జరుగుతుందా? సాక్ష్యాలను తారుమారు చేస్తారన్న అమనీత్ సంశయం కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన అంశం. ఏమైనా కులానికి రక్షణ కవచంగా ఉండే అధికార యంత్రాంగం న్యాయాన్ని రక్షించలేకపోవడం సిగ్గుచేటు. అందుకే పురాణ్‌కుమార్ మృతదేహం ముందు ఈదేశపు పాలకగణం తలదించుకోవాలి.

# సీజనల్ వ్యాధులతో ప్రజారోగ్యం విలవిల

ఏ దేశ అభివృద్ధి అయినా ఆ దేశ ప్రజల ఆరోగ్యం మీదే ఆధారపడి ఉంటుంది. కానీ స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా నేటికీ కనీస ప్రాథమిక వైద్య అవసరాలు తీర్చలేని పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉన్నాయంటే వారికి మనుషుల ప్రాణాలంటే విలువ లేకపోవడమే. ఏటా వాతావరణ మార్పులతో కమ్మేస్తున్న సీజనల్ వ్యాధులు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. కరోనా కంటే ప్రమాదకరంగా వైరల్ జ్వరాలు భయపెడు తున్నాయి. దానికి నమోదవుతున్న కేసులే ఉదాహరణ. రోజు రోజుకు అంటువ్యాధులతో పాటు ఇతర కొత్త జబ్బులు పుట్టుకొస్తున్నాయి. ప్రబలుతున్నాయి. డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, విష జ్వరాలతో మనిషి చిక్కి శల్యమవుతున్నాడు. ఆరోగ్యాన్ని కాపాడుకునేం దుకు లక్షల రూపాయలు ఖర్చు చేసి అప్పుల పాలవుతున్నారు. ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని పాలకులు చెప్పుకుంటున్నా ప్రాథమిక వైద్యరంగం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది.

ఇటీవల దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో వర్షాలు బాగా కురిశాయి. వర్షాలు, వరదలతో జనం బెంబేలెత్తారు. తీవ్ర ఆస్తి నష్టాన్ని కలిగించాయి. వ్యాధులు కూడా చుట్టుము ట్టాయి. ఒక్కొక్కచోట ఒక్కో పరిస్థితి ఉంది. ముఖ్యంగా తెలంగాణలో పరిస్థితి దారుణంగా తయారైంది. ఒకవైపు వర్షాలు, వరదలతో భారీగా నష్టం చేకూర్చింది. దాన్నుంచి తేరుకోకముందే పారిశు ధ్యం లోపించి ప్రజలు అనారోగ్యం బారినపడ్డారు. వైరల్ ఫీవర్ కేసులు పెరిగాయి. జ్వర పీడితులు లేని ఇల్లు లేదంటే ఆశ్చర్య కరమే. జలుబు, దగ్గు, జ్వరాలతో ఆస్పత్రులకు క్యూ కట్టారు. హైదరాబాద్‌లోని గాంధీ, నిలోఫర్, ఉస్మానియా, ఫీవర్ ఆస్పత్రు లతో పాటు జిల్లా ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోయాయి. ఆగస్టులో సగటున 400 నుంచి 600 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఆ సంఖ్య 800కి పెరిగింది. ప్రధాన ఆస్పత్రుల్లో ఓపీ, ఇన్‌పేషెంట్ల సంఖ్య బాగా పెరిగింది. 40 శాతం పైనే పెరిగిన కేసుల సంఖ్య.. సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. జనం విలవిలలాడుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో పాటు ఏజెన్సీల్లో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే రాష్ట్రంలో 5 వేల డెంగీ కేసులు నమోదు కాగా%ß% ఆగస్టు నెలలోనే 300 డెంగీ కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా ఇంకా ఎన్నో కేసులు ఉన్నాయి. దీనికంతటికీ ప్రభుత్వం వద్ద ముందు చూపులేకపోవడమే. వర్షాకాలం ప్రారంభం సమయంలో సీజనల్ వ్యాధులు ప్రబలడం సర్వసాధారణం అని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడం నిర్లక్ష్య ధోరణికి పరాకాష్ట. డాక్టర్లు లేకుండా పీహెచ్‌సీలు ఉండటం, కావాల్సిన మందులు లేకపోవడం, అపరిశుభ్రంగా ఉండటం వల్ల చిన్న చిన్న రోగాలకూ పట్టణ ప్రాంతాలకు వచ్చి రోగులు జేబులు గుల్ల చేసుకుంటున్నారు. పిహెచ్‌సీలను పటిష్టం చేసుకుంటే ఈ పరిస్థితి



ఉండేది కాదు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు లేకపోతే పరిస్థితి మరింత అదుపుతప్పేదేమో. వాస్తవానికి బడ్జెట్లో వైద్యానికి పెట్టిన కేటాయింపులు నామమాత్రమే. అవి కేవలం వేతనాలు, కొత్త భవనాల నిర్మాణాలకు కేటాయింపులు ఉన్నాయి తప్ప ఇతర వాటికి లేవని చెప్పవచ్చు. కానీ కేరళ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. దానికి ప్రధాన కారణం అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసుకోవడం. ప్రతీ గ్రామంలో ఫ్యామిలీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల కేరళ వైద్యరంగాన్ని దేశంలోని అగ్రగామిగా నిలిపిందనడంలో సందేహం లేదు. కరోనా లాంటి ఎన్నో వైరస్‌లను తట్టుకుని ప్రజలందరిని ఆరోగ్యంగా ఉంచడానికి అక్కడ తీసుకున్న జాగ్రత్తలు, అమలు చేసిన విధానాలు కారణం.

పారిశుధ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటే.. ప్రతీ సంవత్సరం విషజ్వరాల కేసులు పెరుగుతూనే ఉంటాయి. సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం కూడా అపరిశుభ్రతకు ఒక కారణం. పాలకవర్గాలు లేవన్న సాకుతో కేంద్రప్రభుత్వం కూడా నిధులు ఇవ్వకుండా ఉండటం దారుణం. అన్నింటికన్నా ముందు పిహెచ్‌సీలను బలోపేతం చేసి ప్రాథమిక ఆరోగ్యరంగాన్ని కాపాడాలి. చాలా దేశాల్లో ప్రభుత్వ ఆస్పత్రులే ఎక్కువ సేవలు అందిస్తుంటే, మన దగ్గర మాత్రం ప్రయివేటు, కార్పొరేట్ రంగాలది సింహభాగం. వైద్యం కోసం ప్రజలు సొంతంగా ఖర్చు చేసే సొమ్ము 87 శాతంగా ఉండటం విస్మయం కల్గిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు కల్పించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ప్రాణాలు కోల్పోవల్సిందేనా. సాధారణంగా సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన చర్యలకు ప్రభుత్వం ఇంతవరకు ప్రణాళికలు చేపట్టలేదు. ప్రజారోగ్యానికి కావాల్సిన వైద్యులను కేటాయించడం, మందులను ఆస్పత్రులకు సమకూర్చడం చాలా ముఖ్యమైనవి. పరిసరాల పరిశుభ్రత, మంచినీటి వసతి కల్పించగలిగితే అనేక రోగాలను నివారించవచ్చు. అందుకే 'అందరికీ ఆరోగ్యం' నినాదాన్ని సాకారం చేయాలంటే ఆరోగ్య వ్యవస్థను మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలేసే విధానాలను పాలకులు విడనాడాలి. ప్రజారోగ్యాన్ని రక్షించాలి.

# సింగరేణి కార్మికులకు మరో శుభవార్త

**- ఒక్కో కార్మికుడికి లక్ష మూడు వేల రూపాయల దీపావళి బోనస్ చెల్లింపు**

**- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రకటన**

**- దీపావళి బోనస్ కోసం రూ.400 కోట్లు వెచ్చించనున్న సింగరేణి**

**- అక్టోబర్ 18వ తేదీన కార్మికుల ఖాతాలో బోనస్ చెల్లింపునకు యాజమాన్యం సర్క్యులర్ విడుదల**

**సింగరేణి భవన్:** దీపావళికి ముందు సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మరొక తీపి కబురును తెలియజేసింది. దీపావళి బోనస్ గా పిలుచుకునే పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ (పి.ఎల్.ఆర్) స్కీం బోనస్ కింద ఒక్కొక్క కార్మికునికి 1.03 లక్షల రూపాయల బోనస్ ను చెల్లింపునకు సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.

సింగరేణి ఉద్యోగులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న సింగరేణి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయూత అందిస్తోందని పేర్కొన్నారు. దీపావళి బోనస్గా 400 కోట్ల రూపాయలను చెల్లించనున్నట్లు, ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ. 1.03 లక్షలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

మొత్తమ్మీద 39,500 మంది కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఇంధన శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీన (శనివారం) కార్మికులకు దీపావళి బోనస్ చెల్లించ నున్నట్లు సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు.

సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికు ఉప ముఖ్యమంత్రికు కార్మికుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు అలాగే సింగరేణి నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాల సాధనకు మరింత అంకితభవంతో పనిచేయాలని కోరారు . అలాగే ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులకు తన దీపావళి శుభాకాంక్షలు



తెలియజేస్తూ బోనస్ సొమ్మును కుటుంబ అవసరాలకు సద్వినియోగం చేయాలని లేదా ప్రభుత్వ పొదుపు సంస్థల్లో పొదుపు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ దీపావళి బోనస్ కేవలం కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. అధికారులకు వర్తించదు భూగర్భంలో 190 మస్టర్లు, ఓపెన్ కాస్ట్ గనులు మరియు సర్ఫేస్ లో 240 మస్టర్లు పూర్తి చేసిన వారికి రూ 1.03 లక్షల పూర్తి బోనస్ అందుతుంది. అంతకంటే తక్కువ దినాలు పని చేసిన వారికి నిష్పత్తి ప్రకారం బోనస్ ను చెల్లిస్తారు. గత ఆర్థిక సంవత్సరంలో 30 మస్టర్లు పూర్తి చేసిన వారు ఈ బోనస్ పొందడానికి అర్హులు.


# బార్బడోస్‌లో తెలంగాణ ప్రతినిధి బృందం

**ప్యారిస్ (ఫ్రాన్స్):** బార్బడోస్ దేశంలో జరిగిన 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (CPA) కాన్ఫరెన్స్ అనంతరం స్టడీ టూర్లో భాగంగా ఫ్రాన్స్ లో పర్యటిస్తున్న తెలంగాణ శాసన బృందం అక్కడి ప్రముఖులతో భేటీ అయింది.

ఫ్రాన్స్ దేశ రాజధాని ప్యారిస్‌లోని భారతదేశ రాయబార కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా.వి.నరసింహా చార్యులు, అధికారులతో కూడిన తెలంగాణ రాష్ట్ర శాసన బృందం చీఫ్ అంబాసిడర్ సంజీవ్ సింఘాలా తో భేటీ అయింది. ఈసందర్భంగా తెలంగాణ శాసన బృందం మాట్లాడుతూ.... భారతదేశంలో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం అని తెలిపారు. తెలంగాణ రైజింగ్ మోటోతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది, ముఖ్యంగా పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహిస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నది.

తెలంగాణ రాష్ట్రంలో అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నందున పర్యాటక, ఆతిధ్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నదని వివరించారు. హైదరాబాద్ నగరం రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్‌గా ఉంటూ ఐటీ ఎగుమతులలో రెండవ స్థానం, బల్క డ్రగ్స్ ఎగుమతులలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నదని వివరించారు.

వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రధమ స్థానం అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు మంచి వాతావరణం, అనుకూలత



ఉన్నాయని తెలిపారు. రాయబారి సింఘాలా మాట్లాడుతూ భారతదేశంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ స్టేట్ అని కితాబిచ్చారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఫ్రాన్స్ దేశానికి పర్యాటకులు బాగా వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు తమవంతుగా ప్రయత్నం చేస్తామని సింఘాలా తెలిపారు. ఈ సందర్భంగా రాయబారి సింఘాలాని తెలంగాణ శాసన బృందం. పోచంపల్లి పట్టు శాలువాతో సన్మానించింది.

# బీసీలకు చట్టసభల్లో సైతం రిజర్వేషన్లను ఇవ్వాలి

**- బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించాలి**

**- బీసీల బంద్‌కు మద్దతు కోరిన బీసీ జేఏసీ నాయకులు, సంపూర్ణ మద్దతు ప్రకటించిన కల్వకుంట్ల కవిత**

**- తెలంగాణ జాగృతి, బీసీ జేఏసీ నాయకుల ఉమ్మడి ప్రెస్ మీట్**

**- తెలంగాణ జాగృతి కార్యాలయానికి బీసీ జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య, వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని , జాతీయ బీసీ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, బీసీ జేఏసీ నాయకులు.. ఘన స్వాగతం పలికిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఇతర నాయకులు**

**హైదరాబాద్:** బీసీల్లో పుట్టి పోరాటం చేయడం కామన్. కవిత బీసీల గురించి పోరాటం చేయడం అభినందనీయం. కవితను బీసీలు ఆదర్శంగా తీసుకోవాలని బిజెపి ఎంపి, బీసీ జాతీయ నేత పిలుపునిచ్చారు. . కవితకు బీసీల మద్దతు తప్పకుండా ఉంటుంది. బీసీ రిజర్వేషన్లను హైకోర్టు కొట్టి వేసింది. సందర్భాలను బట్టి రిజర్వేషన్లను పెంచుకోవచ్చని కోర్టులు తీర్పు ఇచ్చాయి. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించాలి అన్నారు.

ఎస్సీ,ఎస్టీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్ల ఉన్నాయి. బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లను ఇవ్వాలి. బీసీలలో బలమైన ఉద్యమం ఒక్క రాష్ట్రంలో తయారు అయిన కేంద్రంపై ప్రభావం పడుతుంది. బీసీలకు స్థానిక సంస్థల్లో మాత్రమే కాదు చట్టసభల్లో సైతం రిజర్వేషన్లను ఇవ్వాలి.

తెలంగాణలో మొదలైన బీసీ ఉద్యమం అన్ని రాష్ట్రాలకు పాకాలి. బీసీలు అడిగేది శత్రువుల పంచాయతీ కాదు. అన్నదమ్ముల వాటాను బీసీలు అడుగుతున్నారు. బీసీల ఉద్యమానికి తెలంగాణ జాగృతి సహకరించాలి.

**తెలంగాణ జాగృతి బీసీల పక్షపాతి: కల్వకుంట్ల కవిత**

ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ జేఏసీ ఏర్పడింది. తెలంగాణ జాగృతి బీసీల పక్షపాతిగా ఉంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మభ్య పెడుతున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశాయి. రేపు జరిగే బంద్‌లో తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఎక్కడికక్కడ పాల్గొంటారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంటు లో చట్టం చేసే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుంది. మద్దతు అడగకపోయినా బీసీల కోసం తెలంగాణ జాగృతి మద్దతు ఇస్తుంది. తెలంగాణ జాగృతి కార్యాలయానికి వచ్చిన బీసీ జేఏసీ నేతలకు ధన్యవాదాలు.

**కవితలా అగ్రవర్గాల నేతలు బీసీల గురించి మాట్లాడాలి : వీజీ ఆర్ నారగోని**

తెలంగాణలో రెండవ దశ ఉద్యమం బీసీ ఉద్యమ రూపంలో ప్రారంభం అయింది. అన్ని పార్టీలు కట్టకట్టుకుని బీసీలను మోసం చేస్తున్నాయి. బీసీలకు రావాల్సిన హక్కులు, అజెండా మాత్రమే మిగిలి ఉంది. రాజ్యాంగ సవరణ ద్వారానే బీసీలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.



బీసీలకు ఎలాంటి సిద్ధాంతాలు, రాద్ధాంతాలు లేవు. రేపు జరిగే బంద్ కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయి.

మావోయిస్టులు సైతం మద్దతు ఇచ్చారు. కవిత కొంతకాలంగా పూలే విగ్రహం గురించి, బీసీల గురించి మాట్లాడుతున్నారు. కవిత లాగా అగ్రవర్గాల నేతలు బీసీల గురించి మాట్లాడాలి. కేంద్ర ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తెచ్చే విధంగా మనం పోరాటం చేద్దాం. బీసీ జెఏసీకి మద్దతు ఇచ్చిన తెలంగాణ జాగృతికి ధన్యవాదాలు.





# ఇది కేవలం విగ్రహంపై దాడి కాదు.. హిందువులపై దాడి!

**- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు**

**- రాంపల్లి రామాలయం ముందు శ్రీ హనుమాన్ విగ్రహం ధ్వంసం**

**హైదరాబాద్:** రాంపల్లి రామాలయం ముందు శ్రీ హనుమాన్ విగ్రహం ధ్వంసం చేయబడిన ఘటనపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.. స్థానికులతో కలిసి రామాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితిని స్థానికులను అడిగి తెలుసుకు న్నారు. పరిస్థితిని పరిశీలించిన ఆయన, ఇది కేవలం విగ్రహం దాడి కాకుండా హిందువులపై దాడి అని పేర్కొన్నారు.

గతంలో ముత్యాలమ్మ, గణేష్, నవగ్రహ, భూలక్ష్మి, మాతాజీ ఆలయాలపై జరిగిన అనేక దాడులను గుర్తు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పోలీసులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

హిందువుల ఆరాధ్య దేవుడు, ధైర్యాన్ని ప్రసాదించే ఆంజనేయ స్వామి విగ్రహంపై దాడి ప్రతి హిందువుపై దాడిగా పరిగణిస్తున్నాం. గతంలో ముత్యాలమ్మ ఆలయం, గణేష్ విగ్రహాలు, శంషాబాద్‌లోని నవగ్రహ ఆలయం, రక్షాపురంలోని భూలక్ష్మి ఆలయం, శివాజీ నగర్‌లోని మాతాజీ ఆలయం వంటి అనేక దేవాలయాలపై దుండగులు దాడులకు పాల్పడ్డారు.

ఈ కేసులలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న వారిని గుర్తించి, వారిపై తక్షణమే పోలీసులు చర్యలు తీసుకోవాలి. బీజేపీ ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తోంది.

# హైదరాబాద్‌లో ఫారెక్స్ సంస్థలపై ఇడి దాడులు

**హైదరాబాద్:** నగరంలోని విదేశీ నగదు మార్పిడి (ఫారెక్స్) సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (అధికారులు దాడులు నిర్వహించారు. ఆర్‌బీఐ లైసెన్స్ లేకుండానే సంస్థలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులపై ప్రిజమ్, గరుడ, విక్టరీ, విమల్‌నాథ్ ఫోరెక్స్ సంస్థల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. గతంలో ఆర్‌బీఐ అధికారులు నిర్వహించిన దాడుల్లోనూ ఆయా సంస్థల్లో అవకతవకలు బయటపడ్డాయి. దీంతో ఈడీ కూడా దాడులు చేసింది. అయితే, ఆర్‌బీఐ అనుమతి లేకుండానే బోగస్ పత్రాలతో సంస్థలు నడిపిస్తున్నట్టు బయటపడింది. ప్రిజం ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, విక్టరీ ఫారెక్స్, ట్రావెల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, డిజిటల్ ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి కొన్ని సంస్థలు... అక్రమంగా డబ్బు మార్పిడి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయని ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. ఆయా సంస్థలు ఫెమా నిబంధనలు ఉల్లంఘించాయని ఈడీ పేర్కొంది.

# అంతం అయిపోతారు, ఆ తరువాత?

సుప్రసిద్ధ ఉర్దూ కథారచయిత ఖ్వాజా అహ్మద్ అబ్బాస్ 1980లో నక్సలైట్స్ అని ఒక సినిమా తీశారు. సినిమా చివర్లో పెద్ద కాల్పుల సంఘటన తరువాత, పోలీసు అధికారి మెగాఫోన్ పట్టుకుని 'నక్సలైట్లు ఇంకా ఎవరైనా మిగిలిపోయారా' అని గొంతు చించుకుంటూ అడుగుతాడు. నిశ్శబ్దమే సమాధానం. కానీ, అక్కడికి దూరంగా ఒక ఆదివాసీ గూడెంలో చొక్కా కూడా లేని ఒక చిన్న పిల్లవాడు, రెండు చేతులూ ఎత్తుతాడు, తానున్నానన్నట్టు.

అబ్బాస్ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ అభ్యుదయ ఉద్యమం కాలానికి చెందిన రచయిత. ఆయనకు నక్సలైట్ ఉద్యమంతో పూర్తి ఏకీభావమేమీ లేదు. అవగాహనా లేదు. సినిమాలు తీయడం కూడా ఆయనకు రాదు. అయినా ముగింపు అట్లా ఎందుకు చేసినట్టు? ఉద్యమాలు బలప్రయోగంతో అణగారిపోవు అన్న విశ్వాసం, కొనసాగింపు ఉండి తీరుతుందనే ఆశాభావం, ఆయనకు ఉండవచ్చు.

భారతదేశ గృహమంత్రి అమిత్ షా ఈ మధ్య తరచు మావోయిస్టుల అంతం గురించి చెబుతున్నారు. 2026 అన్న గడువును పదే పదే వక్కాణిస్తున్నారు. ఆయన చెబుతున్నట్టుగానే, ఛత్తీస్‌గఢ్ గహనారణ్యం అబూజ్ మడ్‌లో దళాలు దళాలుగా, గూడేలు గూడేలుగా మనుషులు చచ్చిపోతున్నారు.

ఆ చనిపోవడంలో ప్రభుత్వం విజయం చూస్తోంది. తెగిపడిన తలలను, తెగవలసిన తలలను లెక్కపెట్టి మరీ చెబుతోంది. త్వరలోనే అంతా ముగిసిపోతుంది అన్న భరోసాను ప్రకటిస్తోంది. నాలుగువేల చదరపు కిలోమీటర్ల అరణ్యంలో కొత్త అభివృద్ధిని కలగంటోంది.

కొత్త సమాజాన్ని నిర్మిస్తామని తుపాకులు పట్టుకుని పోరాటం చేస్తున్నవాళ్లు మన మధ్య ఆరున్నర దశాబ్దాలుగా కనిపిస్తున్నారు. వాళ్లంతా, ఈ సమాజం కడుపులో నుంచి పుట్టినవాళ్లే. ఈ ప్రజల కన్నబిడ్డలే. పెద్ద ఎత్తున జనాన్ని కూడగట్టి, ఉద్యమాలు చేసి, అంతిమంగా భారత రాజ్యాన్నే పట్టుకోవాలన్నది వాళ్ల వ్యూహం. సహజంగానే ప్రభుత్వాలూ, వ్యవస్థా దాన్ని సహించవు. సాయుధంగా ఉన్నారన్న కారణం ఉంటుంది కనుక, చాటుమాటుగా తిరుగుతుంటారు కనుక వాళ్లను చంపేయడానికి ప్రభుత్వ భటులకు చాలా సులువులు ఉంటాయి. చట్టప్రకారం వెళ్లడం, విచారణ తతంగాలూ ఇటువంటివాళ్ల విషయంలో అనవసరమని భద్రతావ్యవస్థలు నమ్ముతాయి.

ఫలితంగా, వేలాదిమంది నక్సలైట్లు నిర్మూలన అయ్యారు. అదే సమయంలో వేలాదిమంది కొత్తగా పుట్టుకువచ్చారు. ఇప్పుడు ఈ పునరావృత చక్రంలో నిర్మూలనదే పైచేయి అయిందని, ఇక అంతా చదును కాబోతోందని ప్రభుత్వం ఆనందిస్తోంది.

నిజానికి, నక్సలైట్లతోనే మొదలు కాదు. అంతకు ముందు కమ్యూనిస్టులు ఉన్నారు. తెలంగాణతో సహా దేశంలోని అనేక భాగాల్లో తుపాకుల పోరాటం వాళ్లు చేశారు. అంతకు ముందు భగత్ సింగ్, అల్లూరి వంటి విప్లవవాదులు ఆయుధాలు పట్టుకుని బ్రిటిష్ వారి మీద పోరాడారు. 1857లో భారత రైతాంగం, సైనికులు తిరుగుబాటు చేసి, పోరాడి అణగారిపోయారు.

అయినా, ఆ తర్వాత పోరాటాలు పుడుతూనే వచ్చాయి. స్వతంత్రం వచ్చిన సమయంలోను, ఆ తరువాత, కమ్యూనిస్టులు, నక్సలైట్లు కాని వారు కూడా చాలా చోట్ల సాయుధ పోరాటాలు చేశారు, చేస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో అనేక సాయుధ సంస్థలు క్రియాశీలంగా ఉన్నాయి. కొన్నిటితో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది, ఒప్పందాలు కూడా చేసుకుంది.

ఒప్పందాలు చేసుకున్న చోట కూడా కొందరు తిరుగుబాటు దారులు వాటిని ఒప్పుకోక, పోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు. సంస్థలు అంతమై పోవచ్చు, కొన్నిచోట్ల పోరాటాలు మౌనంలోకి పోవచ్చు, ముగిసిపోతాయని చెప్పలేము. కొలంబియాలో గెరిల్లా ఉద్యమం మాఫియాగా మారి, చివరకు లొంగిపోయింది కదా, శ్రీలంకలో టైగర్లను తుడిచిపెట్టారు కదా, మన దేశంలోనూ ఖలిస్తాన్ ఉద్యమం ఉపశమించింది కదా, నేపాల్‌లో మావోయిస్టులు అణగారిపోయారు కదా అని వాదనలు వింటుంటాము. పై ఉదాహరణల్లో ఎక్కడా సమస్య శేషం లేకుండా పోలేదు. కొత్తరూపాల్లో అశాంతి వ్యక్తమవుతోంది.

ఒక చారిత్రక జ్ఞాపకంగా కూడా ఆయా ఉద్యమాలు వర్తమాన రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్నాయి. ఎందుకంటే, ఎందువల్ల అక్కడ సాయుధ రాజకీయాలు వచ్చాయో, ఆ మూలకారణాలు సమసిపోలేదు. ఎక్కడైనా సమస్య లేకుండా పోయి ఉంటే గనుక, అక్కడ ఉభయపక్షాల అంగీకారంతో, పోరాటవాదుల డిమాండ్లను గణనీయంగా నెరవేర్చడంతో మాత్రమే జరిగింది.

1990 దశకం మొదట్లో, సోవియట్ యూనియన్ కకావికలు అయిపోయినప్పుడు, పెట్టుబడిదారీ ప్రపంచం బహిరంగంగా సంబర పడింది. మేధావులు అయితే, చరిత్ర ఇక ముగిసిపోయింది అన్నారు. అప్పుడు ఒక అంతర్జాతీయ జర్నలిస్టు తన కాలమ్‌లో కొన్ని ప్రశ్నలు వేశారు. "అయితే ఏమిటి? లోకంలో మనుషులు ఉన్నదానితో సంతృప్తిపడతారా?

పెట్టుబడిదారీ విధానమే పరమపదమని, ఇంతకు మించిన గొప్ప వ్యవస్థ లేదని సమాధానపడతారా? ఆఫ్రికా ఖండంలోను, ఆసియాలోనూ, దక్షిణ అమెరికా ఖండంలోనూ వారి ప్రభుత్వాలను, ప్రభుత్వాలను శాసిస్తున్న అగ్రరాజ్యాలను వ్యతిరేకించడం విరమించి హ్యాపీలీ లివ్డ్ ఎవరాఫ్టర్ అయిపోతారా?" అని ఆ పాత్రికేయుడు హేళనాత్మకంగా అబ్బురపడ్డారు.

ఈ శతాబ్దం మొదటి దశాబ్దంలో, సెప్టెంబర్ 11, 2001 నాటి కీలక పరిణామం కూడా జరిగిపోయాక, ప్రపంచవ్యాప్తంగా విమాన ప్రయాణాలను కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయాలను కంచుకోటలుగా మార్చారు. ఆ తరువాత, లండన్‌లో సబ్ వేలో ఒక టెర్రరిస్టు పేలుడు జరిగింది. దాని మీద వ్యాఖ్యానిస్తూ మరో జర్నలిస్టు ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ మీద జరిగిన విమానదాడుల నేపథ్య కారణాల మీద దృష్టి పెట్టకుండా, మరింత మందిని టెర్రరిస్టు మార్గంలోకి వెళ్లడానికి ప్రేరేపించే ప్రతీకార చర్యలు తీసుకుంటే, భద్రత ఎట్లా సాధ్యం? మీరు విమానాలను అష్టదిగ్బంధం చేస్తే, ఆత్మాహుతి ఆకాశదాడులు ఆగిపోతాయి.

కానీ, మరోచోట పేలుళ్లు మొదలవుతాయి. భద్రతాచర్యల పరిష్కారం ఎప్పుడైనా విద్రోహచర్యల స్థలాన్ని, పద్ధతిని మార్చవచ్చును కానీ, విద్రోహాన్ని నివారించలేదు, అన్నది ఆ విశ్లేషణ సారాంశం. అశాంతి ఉన్నప్పుడు, దాని ప్రతిఫలనాలు వ్యక్తం అవుతూనే ఉంటాయి.

ఒక రూపాన్ని తుడిచిపెడితే, అది మరో చోట, మరో రూపంలో తలెత్తుతూనే ఉంటుంది. దేన్నైనా సమూలంగా పెకిలించివేయాలంటే, విత్తనం ఎక్కడిదో, నేల ఎందుకు మొలకలను అనుమతిస్తోందో, వేళ్లు ఎక్కడెక్కడ విస్తరించి ఊడలు దిగాయో ముందు తెలుసుకోవాలి. మట్టిలోని ఏ జీవరసాయన చర్య ఆ మొక్కలను సజీవంగా నిలుపుతోందో అవగాహన చేసుకోవాలి.

ఇప్పుడు అమిత్ షా చెప్పినట్టు, అందరూ పట్టుబడి, లొంగిపోయి, చచ్చిపోతారనుకుందాం. తరువాత ఏమి జరుగుతుంది? 370 రద్దుకోసమే పరితపించిన కశ్మీరీలు, అది జరగగానే జన్మధన్యమైందని భావించారని మోదీఅనుకున్నట్టుగా, దేశంలోని ఆదివాసులందరూ ఆనంద పారవశ్యంలో మునిగితేలతారా? తమకూ అభివృద్ధికీ మధ్య అడ్డుగోడలా నిలబడిన విప్లవకారుల పీడ విరగడయిందని పండగ చేసుకుంటారా?

వనవాసీ కళ్యాణం జరిగింది లెమ్మని అదానీ అంబానీలతో చెట్టపట్టాలు వేసుకుని జీవిస్తారా? బ్రిటిష్ వాడు కూడా దూరని భీకరారణ్యం మధ్య నుంచి పలువరసల మహారహదారులు దూసుకుపోతుంటే అభివృద్ధి తమను ఇంత నాగరికంగా కనికరిస్తున్నందుకు ఉప్పొంగిపోతారా?





మావోయిస్టుల తుపాకీచప్పుళ్లు చల్లారి, యుద్ధవిన్యాస శిక్షణల కుహూరుతాలతో దండకారణ్యం కొత్తవసంతాన్ని చవిచూస్తుందా?

అడవుల్లోని ఆదివాసులు మాత్రమే కాదు, అలనాటి అన్నలను గుర్తుచేసుకునే పల్లె ప్రజలూ, హక్కులూ న్యాయమూ అంటూ కాలం చెల్లిన మాటలు మాట్లాడే బహిరంగ ఉద్యమకారులూ, అంగీకారం లేకపోయినా గౌరవం తగ్గించుకోని మేధావులూ, వీళ్లందరూ 'ఆ' తరువాత ఏమవుతారు?

తెలంగాణ సాయుధ పోరాటంతో మొదలుపెట్టి, సుమారు ఏడుదశాబ్దాల పాటు తిరుగుబాటుదారులను అంతం చేస్తూ వచ్చిన కాంగ్రెస్ పార్టీకి కూడా ఇప్పుడు అర్బన్ నక్సల్ ముద్ర తప్పనప్పుడు, దేశంలో మావోయిస్టు నిందపడని వారెవరు మిగులుతారు?

వీరందరూ మిగిలే ఉండగా, అంతం ఎట్లా కుదురుతుంది అమిత్ షా? అబూజ్ మడ్ తరువాత, అనేక యుద్ధరంగాలు! నిర్మూలించవలసిన వారెవరూ లేని స్థితిలో అసలు పాలన ఎట్లా సాగుతుంది? ఎప్పుడూ ఎక్కడో ఒక చోట యుద్ధం చేయనిదే అగ్రరాజ్యాలకు, ఎప్పుడూ ఎవరినో నిర్మూలిస్తూ పోనిదే రేపటి అగ్రరాజ్యాలకు కాలం ఎట్లా గడుస్తుంది?

బహుశా, భౌతికంగా అబూజ్‌మడ్ 'విముక్తం' అయిపోతుంది. జనతన సర్కార్ ఒక జ్ఞాపకం అయిపోతుంది. దేశంలో అక్కడా ఇక్కడా ఉన్న మావోయిస్టు ఉద్యమస్థావరాలు కూడా తీవ్రమయిన ఒత్తిడిలో అణగారిపోతాయి. అంతాన్ని ప్రకటించి అమలుచేస్తున్నప్పుడు, నిస్సహాయంగా ముగిసిపోవడం వీరోచితం కావచ్చును కానీ, సరైనది కాకపోవచ్చును.

కాలం ఉధృతంగానో ఉత్సాహంగానో ఉన్నప్పుడు, విమర్శను ఆహ్వానించే వినయం, సమీక్ష చేసుకోవలసిన అగత్యం లేకపోవచ్చును. నిర్బంధం, నిర్మూలన ఎదురయినప్పుడు విమర్శ, సమీక్ష అనౌచిత్యం, భీరుత్వం అనిపించవచ్చును. మరి ఎట్లా?

తమను తాము కాపాడుకోవడానికి, ప్రజాస్వామిక వ్యవస్థల రాజకీయ వైఫల్యంతో బాధితులవుతున్న ప్రజలకు ఆదరువుగా ఉండడానికి ఎవరు మిగులుతారు? జనజీవనంలో వెలి?సే అనేక యుద్ధరంగాలను నిర్వహించగలవారెవరు? నిర్బంధంతో నిర్మూలన సాధ్యం కాదని పాలకులకు చెప్పినట్టే, వివేచన, విమర్శ కొరవడితే ఉనికీ సాధ్యం కాదని మావోయిస్టులకు చెప్పాలని ప్రజలు కోరుకుంటారు కదా?

నిర్మూలనే ధ్యేయంగా సాగుతున్న చర్యలను నిలిపివేయమన్న విజ్ఞప్తులను వినే పరిస్థితిలో ప్రభుత్వం లేదు. నిజానికి ఆ విజ్ఞప్తిని గట్టిగా చేయగలిగే స్థితిలో కూడా భారతీయ పౌరసమాజం, ప్రజా ఉద్యమశ్రేణులు లేవు. ప్రధానస్రవంతి పార్టీలు మౌనంతో అర్ధాంగీకారాన్ని అందిస్తున్నాయి. చెప్పగలిగిందీ, చెబితే వినే ఆస్కారమున్నదీ మావోయిస్టులే. అస్త్రసన్యాసం చేయమని ఎవరూ చెప్పరు. అన్యాయంగా అంతరించిపోవద్దని మాత్రమే ఎవరైనా అడగగలరు.




# ఆకట్టుకోలేకపోయిన తెలుసు కదా..

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న సిద్ధు జొన్నలగడ్డను 'జాక్' సినిమా రిజల్ట్ నిరాశ పర్చింది. దాంతో కాస్తంత జాగ్రత్త పడుతూ 'తెలుసు కదా' మూవీని చేశాడు. నీరజ కోనను దర్శకురాలిగా పరిచయం చేస్తూ, ఈ మూవీని టీజీ విశ్వప్రసాద్, ఆయన కూతురు కృతి నిర్మించారు.

వరుణ్ (సిద్ధు జొన్నలగడ్డ) ఓ అనాధ. అతని స్నేహితుడు అభి (వైవా హర్ష). ఇద్దరూ చిన్నప్పటి నుంచి కలిసే పెరుగుతారు. మొదటి నుండి తనకంటూ ఓ సొంత కుటుంబం ఉండాలని కలలుకంటూ ఉంటాడు సిద్ధు. తన ప్రమేయం లేకుండానే జరిగిన ఓ బ్రేకప్ తర్వాత బుద్ధిగా అంజలి (రాశీఖన్నా)ని పెళ్లి చేసుకుంటాడు వరుణ్. పెళ్ళి అయిన కొన్ని నెలలకే అంజలికి పిల్లలు పుట్టరనే విషయం తెలుస్తుంది. దాంతో సరోగసీ ద్వారా పిల్లలను కనాలని అనుకుంటారు. అందుకోసం రాగ కుమార్ (శ్రీనిధి శెట్టి) అనే డాక్టర్ ముందు కొస్తుంది. వరుణ్, అంజలికి తాను సరోగసీ ద్వారా బిడ్డ కంటానని చెబుతుంది. అందుకు వరుణ్ అంగీకరించాడా? వరుణ్ కూ రాగాకు ముందే పరిచయం ఉందా? ఆ పరిచయాన్ని ఎందుకు వీళ్ళిద్దరూ అంజలి దగ్గర దాచి పెట్టారు? దాని పర్యవసానం ఏమిటీ? అనేది మిగతా కథ. ముక్కోణ ప్రేమకథా చిత్రాలకు కొదవలేదు. ప్రతి యేడాది ఎన్నో అలాంటి సినిమాలు వస్తూనే ఉంటాయి. ఇది అదే

తరహా రోమ్ కామ్ మూవీ అయినా... ఇందులో విషయం కాస్తంత భిన్నమైంది. ముక్కోణ ప్రేమకథ కంటే కూడా పెళ్ళైన తర్వాత ఓ యువకుడి జీవితంలో జరిగిన విచిత్రమైన సంఘటనలను బేస్ చేసుకుని సాగే కథ ఇది. కొత్తగా పెళ్ళైన ఓ జంట మధ్యలోకి సరోగసీ మదర్ గా ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ వస్తే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయనే అంశంతో నీరజ కోన ఈ కథను రాసుకున్నారు. ఫస్ట్ హాఫ్ ఆసక్తికరంగా సాగినా... సెకండ్ హాఫ్ లో వరుణ్ నిజాన్ని బయటపెట్టిన తర్వాత మూవీ స్పీడ్ తగ్గిపోయింది. అక్కడ నుండి క్లయిమాక్స్ వరకూ లవ్ అండ్ హేట్ రిలేషన్ లోనే కథంతా సాగింది. ఈ మూడు పాత్రల్లో ఎవరికి వారు... తాము తీసుకున్న నిర్ణయం కరెక్ట్ అనే భావనలో ఉన్నా... థియేటర్లోని ప్రేక్షకుడు మాత్రం ఎవరి పక్షానా నిలబడే పరిస్థితి ఉండదు. నాలుగు పాత్రల చుట్టూనే సినిమా అంతా సాగడం బోర్ కొట్టిస్తుంది. ద్వితీయార్థంలో డ్రామాను పక్కన పెట్టేసి, డైలాగ్స్ మీద మూవీని నడిపే ప్రయత్నం చేసింది నీరజా కోన. తీవ్రమైన భావోద్వేగాలను పండించాల్సి చోట పై పై సన్నివేశాలతో సినిమా సాగిపోయింది. లైఫ్ లో చిల్ అవ్వాలనుకునే కేర్ ఫ్రీ గర్ల్ గా శ్రీనిధి శెట్టి బాగానే చేసింది. రాశీ ఖన్నా పాత్ర హుందాగానే సాగినా సెకండ్ హాఫ్ లోని ట్విస్ట్స్ అండ్ టర్న్ ను ఎక్స్ ప్రెస్ చేయడంలో లోటు కనిపించింది. హీరో స్నేహితుడిగా వైవా హర్ష బాగా చేశాడు. అతని పాత్రే సినిమాలో కొంత రిలీఫ్ ను ఇచ్చింది. మిగిలిన మూడు, నాలుగు పాత్రలు ఇలా వచ్చి అలా వెళ్ళిపోయేవే... ఏ పాత్రకూ ప్రాధాన్యం లేదు.







## సామ్రాజ్యం ప్రోమో విడుదల చేసిన ఎన్టీఆర్

తమిళ అగ్ర హీరో శిలంబరసన్ టీఆర్ అలియాస్ శింబు హీరోగా జాతీయ అవార్డు దర్శకుడు, క్రియేటివ్ జీనియస్ వెట్రిమారన్ తెరకెక్కిస్తున్న చిత్రం అరసన్. తెలుగులో సామ్రాజ్యం పేరుతో రానుంది. తాజాగా ఈ చిత్రం ప్రోమోను యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఎక్స్ ద్వారా శుక్రవారం ఉదయం విడుదల చేశారు. ఇంకా షూటింగ్ పూర్తిగా పట్టాలెక్కని ఈ చిత్రం ఉత్తర చెన్నై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ కథతో రూపొందుతుండగా అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా విడుదల చేసిన ప్రోమో 4 నిమిషాలకు పైగా ఉండడమే గాక చూస్తే చాలా రా అండ్ రస్టిక్ లాగా ఉంది. హాత్యా నేరం అభియోగంతో కోర్టుకు వచ్చిన హీరో జడ్జి ముందు నాకేమీ తెలియదు నన్ను ఇరికించారు అని చెబుతూనే మరో వైపు యంగ్ హీరో ముగ్గురిని నరికి చేతులు కడిగే సన్నివేశాలను ప్రజెంట్ చేశారు. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా బాగానే ఉంది. ప్రోమో ఆరంభఃలో జైలర్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఎంట్రీ అతనితో హీరో మాట్లాడే డైలాగ్స్ అదిరి పోయాయి.

ముఖ్యంగా నా స్టోరీని ఎవరితో చేపిద్దామనుకుంటు న్నారు.. ఎన్టీఆర్‌తో చేపించండి కుమ్మేస్తాడు అంటూ శింబ ఉచెప్పే డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. గతంలో వెట్రిమారన్, ధనుష్ కాంబోలో వచ్చిన వడ చెన్నై సినిమాను యూనివర్స్‌గా మార్చి అందులో ఓ పార్ట్‌గా ఈ సినిమాను తీసుకు వస్తున్నారు. ఇదిలాఉంటే ఈ చిత్రంలో సమంత, కీర్తి సురేశ్, సాయి పల్లవిలు ముగ్గురిలో ఇద్దరు కథానాయికలుగా చేయనున్నట్లు తెలుస్తోంది.

## ఎల్లమ్మ సినిమా హీరోగా దేవిశ్రీప్రసాద్

### కోడై కూస్తున్న సోషల్ మీడియా





బలగం వేణు నిర్మించనున్న ఎల్లమ్మ సినిమాకు అరుదైన హీరో దొరికాడు. బలగం వంటి సూపర్ సక్సెస్ తర్వాత వేణు ఎల్లమ్మ అనే మరో చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తోండగా ఎడాదిన్నరగా హీరో విషయంలో తర్జన భర్జనలు జరుగుతూ ఉన్నాయి. నాని, నితిన్, శర్వానంద్, నిఖిల్, బెల్లంకొండ శ్రీనివాస్ ఇలా నలుగురైదుగురు పేర్లు తెరమీదకు వచ్చి పోవడం జరిగిపోయాయి. ఇక కథానాయుకల విషయంలోనూ సాయి పల్లవి, కీర్తి సురేశ్‌ల మధ్యే చర్చలు నడుస్తున్నట్లు వార్తలు ఎప్పటినుంచో ఉన్నాయి. అయితే.. తాజాగా ఈ స్థానంలోకి సంగీత దర్శకుడు దేవీ శ్రీ ప్రసాద్ పేరు రావడం సినీ లవర్స్‌ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇప్పుడు ఈ వార్త సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో హాల్‌చల్ చేస్తోంది.

అంతేగాక ఈ సినిమాకు దేవీనే సంగీతం కూడా అందించనున్నట్లు సమాచారం.ఇప్పటికే డ్యాన్స్, నటనలోనూ దేవీకి అద్భుత ప్రతిభ ఉంది. అయితే ఈ వార్తల విషయంలో ఇప్పటివరకు అధికారిక ప్రకటన అయితే లేదు. మేకర్స్ , దర్శకుడు వేను, దిల్ రాజు, దేవీ శ్రీ ప్రసాద్ స్వయంగా స్పందిస్తే తప్ప ఈ వార్తలపై క్లారిటీ రాదు. ఇదిలాఉంటే.. కుమారి 21ఎఫ్ సినిమా సమయంలో దేవి శ్రీ ప్రసాద్‌ని నా ఎస్వీసీ బ్యానర్ లో సుకుమార్ దర్శకత్వంలో హీరోగా పరిచయం చేస్తాను అని దిల్ రాజు గతంలోనే మాట ఇచ్చాడు.

కానీ దశాబ్దం గడిచినా అది ముందుకు పడలేదు. ఇప్పుడు ఈ చిత్రంతో అటు వేణు, ఇటు డీఎస్పీ ఇద్దరిని కలిపి సినిమా తీస్తే దిల్ రాజు ఇచ్చిన మాట కూడా నేరవేరినట్లే అవుతుందని టాక్ వినిపిస్తోంది. అయితే ఎల్లమ్మ సినిమా విషయంలో ఎలాంటి వార్తలు వస్తాయో ఎదురు చూడాలి.

## 'ఊ అంటావా' పాటను ఒక ఛాలెంజ్ గా చేశా..



ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు తన కెరీర్, వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా 'పుష్ప: ది రైజ్' చిత్రంలో అల్లు అర్జున్‌తో కలిసి ఆమె చేసిన 'ఊ అంటావా' పాట దేశవ్యాప్తంగా ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. అయితే ఆ పాటను తాను ఎందుకు చేయాల్సి వచ్చిందో సమంత తాజాగా వెల్లడించారు. అదొక సవాలుగా స్వీకరించి ఆ పాటలో నటించినట్లు తెలిపారు.

ఇటీవల జరిగిన 'ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2025'లో పాల్గొన్న సమంత పలు విషయాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా 'ఊ అంటావా' పాట ప్రస్తావన రాగా, ""ఆ పాటను నేనొక ఛాలెంజ్‌గా తీసుకుని చేశాను. నేను చేయగలనో లేదో చూసుకోవాలనుకున్నాను. నన్ను నేను ఎప్పుడూ సెక్సీగా భావించలేదు. నాకు ఎవరూ బోల్డ్ పాత్రలు ఇవ్వరని తెలుసు. అందుకే ఒక్కసారి ప్రయత్నించాను" అని సమంత వివరించారు.

అదే సమయంలో, తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లు, వాటివల్ల ఎదురైన ఇబ్బందుల గురించి కూడా ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "నా ప్రయాణాన్ని గమనిస్తున్న ప్రతి ఒక్కరికీ నా వ్యక్తిగత ఇబ్బందుల గురించి తెలుసు. నా విడాకులు, అనారోగ్యం.. ఇలా ప్రతీది ప్రజల ముందు ఉంది. మనం బలహీనంగా కనిపించినప్పుడు నిరంతరం జడ్జ్ చేస్తారు, ట్రోల్ చేస్తారు" అని ఆమె తన బాధను పంచుకున్నారు.

అంతేకాకుండా, యువతకు ఆశయాలు ఉండాలని, అయితే ఆ ఆశయాలకు ఒక ఉద్దేశం కూడా జతకావాలని సమంత సూచించారు. "నాకు ఆశయాలు ఎక్కువ. యువత తమ మెంటార్స్‌ను చాలా జాగ్రత్తగా ఎంచుకోవాలి. నా జీవితాన్ని మార్చేసిన మెంటార్స్‌ను నేను జాగ్రత్తగా ఎంచుకున్నాను. అందుకే ఉన్నత స్థానాల్లో ఉన్నవారు కూడా బాధ్యతగా ఉండాలి" అని సమంత పేర్కొన్నారు. కాగా, ఆమె చివరిసారిగా 2024లో విడుదలైన 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీస్‌లో కనిపించారు.

## కె ర్యాంప్'పై ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం...

### - కిరణ్ అబ్బవరం

యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం నటించిన తాజా చిత్రం 'కె ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ పతాకాలపై రాజేష్ దండా, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహించాడు. దీపావళి పండుగను పురస్కరించుకుని (అక్టోబర్ 18న) ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్రబృందం సినిమాపై పూర్తి విశ్వాసాన్ని ప్రదర్శించింది.

హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, "'కె ర్యాంప్' ఒక హెవీ ఎంటర్‌టైనర్ అని మొదటి నుంచి చెబుతున్నాం. మేమిచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం. దీపావళికి ప్రేక్షకులు మా సినిమాతో థియేటర్లలో పండుగ చేసుకుంటారన్న నమ్మకం ఉంది. ఈ సినిమాలో ఉన్న ఫన్, ఎనర్జీ, వైబ్ ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుంది. ఇలాంటి సందడి చేసే సినిమా వచ్చి చాలా రోజులైంది" అని అన్నారు.

సినిమా విడుదల తేదీ గురించి మాట్లాడుతూ, "మాకు 17వ తేదీ సెంటిమెంట్‌గా కలిసిరాదని, అందుకే ఒకరోజు ఆలస్యంగా 18న వస్తున్నాం. శుక్రవారం విడుదలైతే మరో రోజు సెలవు కలిసొచ్చేది. అయినా శనివారం విడుదలైనా మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రేక్షకుల నుంచి వచ్చే పాజిటివ్ మౌత్ టాక్‌తో సినిమా విజయం సాధిస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు.

సినిమాలోని తన పాత్ర గురించి వివరిస్తూ, "ఈ కథ మొత్తం కుమార్ అనే నా పాత్ర చుట్టూ తిరుగుతుంది. క్యారెక్టర్ బేస్డ్ చిత్రాలను ప్రేక్షకులు బాగా ఆదరిస్తారు. మొదటి భాగం యూత్‌ఫుల్ అంశాలతో, రెండో భాగం ఫ్యామిలీ ఎమోషన్స్‌తో సాగుతుంది. నిజ జీవితంలో నేను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాను, కానీ ఇందులో రిచ్ కిడ్‌గా నటించాను. ఆ పాత్ర కోసం నా స్నేహితుడిని స్ఫూర్తిగా తీసుకున్నాను. నా కెరీర్‌లో విజయాలు, అపజయాలు రెండింటినీ చూశాను. ఫలితం ఎలా ఉన్నా నా పని నేను చేసుకుంటూ వెళుతున్నా. కిరణ్ అబ్బవరం సినిమా అంటే కచ్చితంగా బాగుంటుందనే నమ్మకాన్ని ప్రేక్షకుల్లో కలిగించడమే నా లక్ష్యం" అని తెలిపారు. ప్రచారంలో భాగంగా పలు ప్రాంతాల్లో పర్యటించినప్పుడు సినిమాపై ఉన్న క్రేజ్ చూసి తనలో ఆత్మవిశ్వాసం రెట్టింపైందని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నటుడు నరేశ్ మాట్లాడుతూ, "సామజవరగమన తర్వాత నా రెండో ఇన్నింగ్స్‌లో మరో ముఖ్యమైన పాత్ర 'కె ర్యాంప్'లో చేశాను. ఈ సినిమా దర్శకుడు నానిలో నాకు ఇద్దరు ప్రముఖ దర్శకులు కనిపిస్తారు. సమాజంలోని వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే విషయంలో సందీప్ రెడ్డి వంగా, వినోదాన్ని నాన్‌స్టాప్‌గా అందించడంలో అనిల్ రావిపూడిల కలయికలా అనిపించాడు. మూడు తరాల ప్రేక్షకులు కలిసి చూసి ఆనందించేలా ఈ సినిమా ఉంటుంది. ముఖ్యంగా సెకండాఫ్ అద్భుతంగా వచ్చింది. ఇందులో నా పాత్ర కూడా చాలా భిన్నంగా ఉంటుంది. మొదట నేను చేయగలనా అని సందేహించినా, ధైర్యం చేసి నటించాను. సినిమా ఏ స్థాయి విజయం సాధిస్తుందనేది రాబోయే మూడు రోజుల్లో తేలిపోతుంది" అని పేర్కొన్నారు.

హీరోయిన్ యుక్తి తరేజా మాట్లాడుతూ, "ఈ చిత్రంలో నా పాత్ర చాలా భిన్నంగా, కాస్త పిచ్చిగా ప్రవర్తిస్తూ ఉంటుంది. హీరో, హీరోయిన్ పాత్రలు నువ్వా నేనా అన్నట్లు పోటీపడి ఉంటాయి. మా మధ్య కెమిస్ట్రీ,




లవ్ స్టోరీ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా షూటింగ్ అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేను," అని చెప్పారు.

దర్శకుడు జైన్స్ నాని మాట్లాడుతూ, "మేము ప్రచారంలో చెప్పినట్లుగానే 'కె ర్యాంప్' ఒక కంప్లీట్ ఎంటర్‌టైనర్. సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి కూడా ఇదే స్పందన వస్తుందని ఆశిస్తున్నాను. ఎక్కడా బోర్ కొట్టకుండా కథనాన్ని ఆసక్తికరంగా నడిపించాను. అందుకే నరేశ్ గారు నన్ను అనిల్ రావిపూడితో పోల్చారు" అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154